# కాలజ్ఞానసుధ

ఆధ్యాత్మిక మాస పత్రిక

జనవరి - 2015 సంపుటి: 19 సంచిక: 1




## ఈ నెల సూక్తి

ఉన్నతంగా ఆలోచిస్తూ బ్రతికే వారి కెన్నడూ ఒంటరితనం అంటూ ఉండదు. వారి ఆలోచనలే వారి ప్రియనేస్తాలు



## విషయ సూచిక


| | |
|---|---|
| సంపాదకీయం - మనల్ని మనం సంస్కరించుకుందాం | 4 |
| మాతృదేవోభవ - పితృదేవోభవ | 6 |
| వేద పరిచయము - ఋగ్వేద పరిచయం | 8 |
| మకర సంక్రాంతి | 10 |
| వీరకాళికాంబా శతకం - ధర్మము - కర్మము | 13 |
| వ్యవహారము - ఆధారము | 15 |
| జపతో నాస్తి పాతకమ్ | 17 |
| భారతీయ ప్రతిభా పాటవాలు -కౌటిల్యుడు -అర్థశాస్త్రం | 19 |
| రఘువంశం | 20 |
| మాఘమాసం - మహాపుణ్య ఫలప్రదం | 24 |
| సనాతన ధర్మము - దాని విశిష్టత (ఇంద్రియ నిగ్రహం) | 26 |
| యోగవాసిష్ట కథాలహరి - బ్రహ్మదేవునికి బాల బోధ | 28 |
| భగవద్గీతకు భాసురభాష్యం | 30 |
| అష్ట వినాయకులు - (వికట) | 33 |
| దర్శనీయ దేవాలయాలు (కాకినాడ) | 35 |
| వివిధ వ్యాధులు ఆయుర్వేద చికిత్సలు | 37 |
| వాస్తు - సైన్సు | 38 |


ముఖచిత్రం : శ్రీ గోవిందమాంబా మహాదేవి (భక్తులకు దర్శనమిచ్చిన రూపం)


**చందా వివరములు**

జీవిత చందా(20సం॥) : 1116/-
సంవత్సర చందా : 70/-



చందాలు పంప వలసిన చిరునామా:

**కాలజ్ఞాన సుధ**

శ్రీ అచలానంద ఆశ్రమము, 8-202(1), మంగమూరు రోడ్డు,
ఒంగోలు - 523 002 ప్రకాశం జిల్లా, (ఆం. ప్ర)
ఫోన్స్: 08592/235341, 9949132469,
9705555229, 8977799289



సంపాదకులు: శ్రీ పరిపూర్ణ సిద్ధానందస్వాములవారు

సంపాదకీయం

# మనల్ని మనం సంస్కరించుకుందాం

పూర్వకాలం నుండి మన సమాజంలో సంస్కరణలు జరుగుతూ వస్తున్నవి. రాజారాంమోహన్‌రాయ్ , వీరేశలింగం పంతులు లాంటి సంఘ సంస్కర్తలు మన సమాజంలోని లోపాలను సవరించారు. ఆయా కాలాలలో వచ్చిన మేధావులు వారి ముందున్న దురాచారాలను అరికట్టారు. సమాజంలో ఎన్నో మార్పులు వస్తున్నవి. ఆ మార్పులలో కొన్ని కొన్ని కొంత కాలంవరకు రాణిస్తున్నాయి. మళ్లీ వాటి స్థానంలో కొత్తదనం సంతరించుకొని మనముందుంటుంది. మరునాటి నుండి నేటి వరకు సంఘంలో సవరణలు జరుగుతూనేవున్నాయి. దీని అర్థమేమిటంటే ? మనం మారాలి అని.

మనం మారటమంటే ఏమిటి సద్గుణాలను సంతరించుకోవాలి. సాటివారికి సాయపడాలి. పదుగురికి మనం ఉపయోగపడాలి. ఎక్కువ మంది అభిప్రాయాలు, స్వార్థపూరితంగా వుంటున్నాయి. “నీ కంటిలో నా వ్రేలు పెడతా - నా నోట్లో నీ వ్రేలు పెట్టు” అన్న చందంగా వుంటుంది. నాడైనా, నేడైనా మారవలసింది మనమే. మనం మారకుండా సమాజం చెడుపోతుంది, పరిస్థితులు బాగాలేవు అని అంటుంటారు కొంతమంది. అసలు సమాజం అంటే ఎవరు ? మనం కాదా ? మనమందరం కలిస్తే అది సమాజం.

మనం బాగుండాలి అనుకుంటే, అది విశాల దృక్పథం. నేను బాగుండాలి అనుకుంటే అది కురచబుద్ధి లేదా స్వార్థబుద్ధి, ఎదుటివారు చెడిపోవాలి అంటే అది క్షమించరాని నేరం ఈ మూడింటిలో మనం (తాను) ఏ కోవకు చెందిన వారమో గమనించుకోవాలి. అలా గమనించినప్పడే తనను తాను సంస్కరించుకోగలుగుతాడు. మనసులోని దోష బుద్ధి తనను దిగజారుస్తుంది. స్వార్థబుద్ధి అయితే పతనం చేస్తుంది. కుటిలబుద్ధి అయితే అన్ని విధాల కృంగదీస్తుంది సుమా ? నీలో పలు దోషాలను పదిలపరచుకొని ఎదుటివారిలో దోషాలను వెతుకుతున్నావ్. తద్వారా నీవు ఇంకా పలుచబడతావే తప్ప లాభపడటమంటూ జరుగదు.

పరహితం స్వహితంగా భావించాలి. పరుల సుఖసంతోషాలు మనకు ఆనందాన్ని కలిగించాలి. సాటివారి ప్రాభవం మనకు ఆనందాయకం కావాలి. ఆక్రోశాన్ని కలిగించరాదు. మనలో మనకు దోషాన్ని ఆపాదించే లక్షణాలు ఏమివున్నాయో వాటిని మార్చుకోవాలి. ఒకవేల అప్పటికప్పడు సాధ్యం కాకపోతే నిదానంగా వాటిని తొలగించుకోవాలి. అలా ప్రయత్నించి సఫలీకృతులయ్యే వారే యోగ్యులు. అలాంటి వారే సమాజంలో గొప్పవారుగా మిగులుతారు. మనం గొప్ప వారుగా ఆరాధించేవారిలో చాలామంది తనను తాను సంస్కరించుకొని గొప్పవారైనవారే సుమా! మనం సంస్కరించబడితే సమాజం సంస్కరించబడినట్లే. కారణం మనమందరం కలిస్తేనే సమాజం కనుక! మన ప్రధాని మోడీగారు చెప్పిన స్వచ్ఛభారత్ కావాలంటే మనమందరం స్వచ్ఛ వ్యక్తులంకావాలి. మనం సంస్కరించబడితే భగవంతుని పూజకు పనికివచ్చే

పుష్పాలమైనట్లే సుమా ?

జనుడు కోరలున్న సర్పమ్ము కారాదు
తోడేలవుట మంచి త్రోవగాదు
నరుడె బ్రహ్మమెరుగ నారాయణుండౌను
కాళికాంబ! హంస! కాళికాంబ!

అని ఆనాడే శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామివారు ప్రభోధించారు. వ్యక్తి సంస్కరణ సమాజసంస్కరణ, వ్యక్తి సంస్కరణలేనిదే సమాజంలో పూర్తి శుభఫలితాలను అందుకోలేము. ఆత్మీయ సోదరీ, సోదరులారా మనమందరం మహోన్నతులుగా మారుటకు బాటలు వేద్దాం. సంస్కరణలే ధ్యేయంగా సాగుదాం! మనసంస్కృతీ సాంప్రదాయాలకు శోభను చేకూరుద్దాం.

గమనిక : మహోన్నతులు, మహాత్ములు, త్యాగశీలులు అన్నవారికే కాదు మన ఈ సందేశం.

ప్రియపరిపూర్ణ ఆత్మబంధువులైన మీ అందరికీ నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాభినందనలు.




నహీం - అహోం- ఓం

**శుభ ఆహ్వానము**

**తేది 1-1-2015 ముక్కోటి ఏకాదశి**

**శ్రీ గోవిందమాంబా మహాదేవి జయంతి**

**సందర్భముగా విశేష కార్యక్రమములు జరుగును.**

**శ్రీ అచలాంనద ఆశ్రమము**, ఒంగోలు, ప్రకాశం జిల్లా మరియు తోట్లపల్లి, కడప జిల్లా.

**అఖిలాంధ్ర సాధు పరిషత్ స్వర్ణోత్సవములు**

అఖిలాంధ్ర సాధు పరిషత్ స్వర్ణోత్సవములు **2015 జనవరి తేది 9,10,11 శుక్ర, శని, ఆది వారములలో** హైదరాబాదు, కూకట్‌పల్లి, మెట్రోషాపింగ్ మాల్ వెనుక ఉన్న ***N* గార్డెన్** నందు పరిషత్ అధ్యక్షులు ఆచార్య శ్రీ **శంకరానందగిరి స్వాములవారి** అధ్యక్షతన జరుగును. జగద్గురువులు, మఠాధిపతులు, పీఠాధిపతులు, మహాత్ములు, పండితులు పాల్గొని తమ దివ్య సందేశాత్మక ఆశీర్వాదములు నొసంగెదరు. కావున జిజ్ఞాసువులు పాల్గొని పరాత్పరుని కృపకు పాత్రులగుదురు గాక.

**ఆచార్య శ్రీహరితీర్థ స్వాముల వారు**
శ్రీ విశ్వమీమాంస మాసపత్రికా సంపాదకులు, అఖిలాంధ్ర సాధు పరిషత్ ప్రధాన కార్యదర్శి,
శ్రీ సత్యానందాశ్రమము, ఇనమడుగు పోస్టు, నెల్లూరు జిల్లా. సెల్: 9440279712

జ్ఞాన సుధ

# మాతృదేవోభవ - పితృదేవోభవ

సహజ కవి వి. శ్రీరామరెడ్డి

మాతాపితరులు దేవతలతో సమానమంటుంది శ్రుతి. తల్లిదండ్రుల మీద దయలేని పుత్రుండు పుట్టనేమి వాడు గిట్టనేమి అంటాడు వేమన. సకల పురాణేతిహాసములు తల్లిదండ్రులు పూజింపదగినవారు. వారికి ఏలాంటి కష్టం కలిగించకూడదు. అట్లు కలిగించిన వారికి వంశోన్నతి కూడా దక్కదంటున్నాయి. పదిమాసాలు తనగర్భంలో దాచుకొని బిడ్డల ఆరోగ్యం కొరకు తాను పథ్యం చేస్తుంది తల్లి. బిడ్డలు ఆరోగ్యంగా వుండాలని పూజలు వ్రతాలు ఎన్నో కట్టుబాట్లు ఆచరిస్తుంది భరింపరాని ప్రసవవేదన ననుభవించి బిడ్డకు జన్మనిస్తుంది. బిడ్డ ఊయలలో నుంచి క్రిందబడితే తనకు దెబ్బతగిలినట్లు ఆ బాధకు లోనవుతుంది. తండ్రి బిడ్డ యోగ క్షేమములకోసం తలమునకలవుతూ అహర్నిశలు ఆలోచించి వారి బాధ్యత తీసుకొంటాడు. బిడ్డల జీవిత లక్ష్యం తల్లిదండ్రుల శ్రద్ధమీదనే ఆధారపడివుందనేది పరమ సత్యం. తామెన్నికష్టాలనైనా అనుభవించి సంతానక్షేమం కోరుకొంటారు తల్లిదండ్రులు. దేవతలెవ్వరికీ కనిపించరు కనిపించే దేవతలు తల్లిద్రండులు.

తల్లిదండ్రులనుంచే బిడ్డల దేహముత్పన్నమైనదని శాస్త్రం చెబుతున్నది. కావున వారికనీసావసరాలను బిడ్డలే తీర్చాలి. ఎంతోశ్రమదీసుకొని పిల్లలను ప్రేమానురాగములతో పెంచి పెద్దచేసి విద్యాబుద్ధులు చెప్పించి ఆ బిడ్డలు ప్రయోజకులైననాడు మురిసిపోతారు తల్లిదండ్రులు. అటువంటి మహనీయమూర్తులను వృద్ధాశ్రమాల వైపు మళ్ళిస్తున్న ఈరోజులలో ఆ ప్రేమానురాగములు సదరు పిల్లలకేస్థాయిలో నున్నాయో వారే చెప్పాలి.

**తల్లిదండ్రి గురుసేవనారాయణా! చేయుదల పెట్టగాలేదు నారాయణా!**

**కలరెవారల మించి నారాయణా! ఘనులు లోకమునందు నారాయణా!**

అంటాడు ఓ కవి మహాశయుడు.

చిన్నప్పుడు అమ్మనాది అమ్మనాది యని మారం చేస్తారు పిల్లలు. అదే పిల్లలు పెద్దయి పెళ్ళికావడం ఆలస్యం. అమ్మనీది అమ్మనీదేనని నిర్మొహమాటముగా చెప్పేస్తారు. అమ్మ అందరిదీ కదా ? ఎందుకీ వివక్ష, అక్షరాలా తొమ్మిదినెలలు మోసి గర్భనరకం అనుభవించి తనకు జన్మనిచ్చిన అమ్మ బిడ్డల నందరిని సమానంగా చూస్తుంది. అమ్మకు ఎలాంటి పక్షపాతం ఉండదు. మరి అమ్మకులేని వివక్ష బిడ్డల కెందుకో ? అట్లే తండ్రిబిడ్డల జీవితాశయంపై శ్రద్ధతీసుకొని సంతానాభివృద్ధికి బాటలు వేసి చదువులు సాములు చెప్పించి ప్రయోజకులైననాడు మురిసిపోతాడు. అటువంటి పుణ్యమూర్తులను ఈనాడు బిడ్డలు తల్లిదండ్రులన్న ధ్యాసలేక వారికి కావలసిన కనీసావసరాలను విస్మరించి గౌరవ మర్యాదలు మంటగలిపి ఏ వృద్ధాశ్రమాలలోనో విడిచి బిడ్డలమన్న సంగతి మరచిపోతున్నారు. ఎంతదారుణం ? ఎంత కర్కశం ? ఎంత కాఠిన్యం ? ఆ మాతృమూర్తుల ఆవేదన అర్థము చేసుకోలేరా, ఈ వ్యవస్థ మారదా ? ఇంతేనా? బిడ్డలూ ఆలోచించండి, రేపు మీకు కూడా వృద్ధాప్యం అనివార్యం, యథారాజా తథాప్రజా!

**క॥ పుత్రోత్సాహము తండ్రికి పుత్రుడు జన్మించినపుడు పుట్టదు, జనులా**
**పుత్రుని గనుగొని పొగడగ పుత్రోత్సాహంబునాడు పొందుర సుమతీ ॥**

కుమారుడు పుట్టగనే తండ్రికి సంతోషం కలుగదు, ప్రజలు ఆ కుమారుని సుగుణములు చూచి మెచ్చుకొన్నప్పుడు ఆ తండ్రికి కలుగు సంతోషానికి అవధులుండవు. తల్లిదండ్రులకు సంతోషం కలిగించు తనయుడు శ్రీరామచంద్రునిలా ఉండాలి.

శ్రీరామచంద్రుడు తండ్రి ఆజ్ఞ పాటించాడు. ఎందుకు పాటించాడు. ఎందుకనగా ? తండ్రికి పుత్రుడై పుట్టినందుకు తన ఋణం తీర్చుకోవాలనుకున్నాడు. సీతమ్మగారితో వనవాసానికి పయనమయ్యాడు. పర్ణశాలలోనున్న సీతమ్మను రావణాసురుడెత్తుకపోతే సుగ్రీవునితో మైత్రిచేసి వానరసైన్యం సమకూర్చుకొని సముద్రానికి వారిధిగట్టి లంకలోనున్న రావణుని వధించి సీతమ్మగారితో తిరిగివచ్చి పట్టాభిషిక్తుడై అయోధ్యను పాలించాడు.

**వలచినపుడెల్ల వానలు కురియుచుండె ప్రబలిరందరు పాడియుపంట లెనసి**
**నెట్టుకొని పోకకు పుట్టెడమ్మ శ్రీరఘుస్వామి రాజ్యంబు చేయుకతన.**

శ్రీరామచంద్రుని రాజ్యంలో వ్యవసాయానికి తగినట్లు వర్షముకురిసి పాడి పంటలతో ప్రజలు ఏలోటులేక సంతోషంతో నుండిరని రామాయణం తెలుపుచున్నది. అందునుబట్టి శ్రీరామచంద్రుని పరిపాలనకు దీటులేదని, అటువంటి పాలన రామరాజ్యంలోనే సాధ్యమని కొనియాడ బడినది. ఈవిధముగా శ్రీరామచంద్రుని పరిపాలనకు అన్ని లోకములు మెచ్చుకొనుటకు ఆ మహానుభావుడు ధర్మనిరతిలో నుండుటయే కారణము. అందుకే **"రామో విగ్రహవాన్ ధర్మః"** అని సకల లోకాలు పొగిడాయి. తండ్రి ఆజ్ఞ పాటించి ఎన్నో కష్టములనుభవించిన శ్రీరామచంద్రుడు స్థిరకీర్తి పొందాడు. జగానికే దేవుడయ్యాడు. ఆలాగున ఎంతోమంది పురాణపురుషుల తల్లిదండ్రుల ఆజ్ఞపాటించి సమాజంలో నాటికి నేటికి గొప్ప పేరుగాంచారు. కావున ప్రతి పుత్రుడు జననీ జనకులయెడ దయాభిమానములు గలిగి సత్ప్రవర్తనచే వారి సేవచేయాలి. పెద్దలయెడల గౌవరవము, గురువులయందు వినయముతో మెలగాలి. అప్పుడే తల్లిదండ్రులు బిడ్డలజూసి మురిసిపోగలరు.

మానవ జీవితంలో వృద్ధాప్యం కష్టతరమైన దశ. ఈ దశలో బిడ్డలు తల్లిదండ్రుల దగ్గరుండి (వృద్ధాశ్రమాలలోనికంపక) కర్తవ్యము నెరిగివారి యోగ క్షేమములు బాధ్యతగా స్వీకరించాలి. ఎందుకనగా ? బిడ్డలు అన్నంతిన్నంత వరకు బుజ్జగించి లాలించి కడకు ఏడ్చి తినపిస్తుంది తల్లి. బిడ్డల శ్రేయస్సుకై తండ్రి ఎంతో కష్టపడి ఆ బిడ్డల ఆలనాపాలనా చూస్తాడు. అందుకే తండ్రి ఆకాశమునకంటే ఎత్తైనవాడని చెబుతున్నది మహాభారతం (యక్షప్రశ్నలు) ఎంతైనా మాతాపితరులు పూజనీయులేకదా!

**తల్లిదండ్రిమీద దయలేని పుత్రుండు**
**పుట్టనేమి వాడు గిట్టనేమి**
**పుట్టలోన చెదలు పుట్టదా గిట్టదా ? ॥ విశ్వ॥**

పుట్టలో చెదపురుగులు రోజు ఉదయం పుట్టి సాయంత్రం చస్తూ వుంటాయి. వాటితో ఎలాంటి లాభములేదు నష్టములేదు. అలాగే తల్లిదండ్రులమీద దయాభిమానములులేని కుమారుడు ప్రాణముతో ఉన్ననూ ఒకటే లేకున్ననూ ఒకటే నంటాడు వేమన. నిజమేకదా మరి.

**గమనిక :** డిసెంబరు మాస పత్రికలో 'అన్నదాతా సుఖీభవ' వ్యాస కర్త : **సహజ కవి వి. శ్రీరామరెడ్డి** గారు అని గమనించగలరు.

# వేద పరిచయము

## ఋగ్వేద పరిచయము

.......... ఆచార్యడా॥ మట్టి కృష్ణారెడ్డి ............

'ఋచస్తుతౌ' అను ధాతువు చేత 'ఋక్' శబ్దము ఏర్పడును. 'ఋక్' అనగా స్తుతించడం అని అర్థం. **"స్తుతిర్నామ గుణానువాదః"** స్తుతి యనగా వస్తువు - పదార్థము లేదా వ్యక్తి యొక్క గుణగణములను ఉన్నది ఉన్నట్లు వివరించడం అని అర్థం. సృష్టికర్త అయిన పరమేశ్వరుడు ఈ విశ్వములోని అణువు మొదలు పరమేశ్వర పర్యంతము గల సమస్త పదార్థముల వివిధ గుణగణాలను ఋగ్వేదం ద్వారా వర్ణించి తెలిపినాడు. **"ఋచ్యతే స్తూయతే యయా సా ఋక్, తాదృశీనాం ఋచీనాం సమూహ ఏవ ఋగ్వేదః"** స్తుతించునది ఋక్, ఆ ఋక్కుల సమూహమే ఋగ్వేదము' అని వ్యుత్పత్తి. **"అర్చ్యతే ప్రశస్యతే అనేన దేవవిశేషః ఇతిఋక్"** దేని చేత ఈ ప్రపంచపదార్థముల - దేవతల - దివ్యగుణపదార్థాల గుణాలు స్తుతించ - కీర్తించబడతాయో దానికి ఋగ్వేదమనే పేరు వచ్చింది. శాఖోపశాఖలుగా విస్తరించిన వైదిక, లౌకిక వాఙ్మయ మహావృక్షానికి బీజరూపమైంది ఋగ్వేదం.

వేదాలలో మొదటగా లెక్కించబడునది ఋగ్వేదం. వేదములను సంహితలని కూడా అంటారు. 'సంహిత' అనగా సంకలనము. అనగా మంత్రభాగమును సంహితలంటారు. ఋక్కులన్ని ఒక్కచోట సంకలనం చేయబడిందే ఋగ్వేదసంహిత. అలాగే యజుర్వేద సంహిత, సామవేద సంహిత, అథర్వ వేద సంహిత'. మూలవేదములను సంహితలని పిలువబడతాయి. ఈ నాలుగు వేదములందు మొత్తం 20, 417 మంత్రములున్నవి. ఒక్క ఋగ్వేదమునందే 10,580 1/4 మంత్రములున్నవి. అనగా సంహితాసర్వస్వంలో సగభాగం ఋగ్వేదమే ఆక్రమించింది. యజుర్వేద, సామవేద, అథర్వవేదాల్లో కూడా ఋగ్వేదమంత్రాలు ఎన్నో ఉన్నాయి. దాదాపుగా 1800 మంత్రాలు ఋగ్వేదములోనివే సామవేదములో ఉన్నాయి. కేవలం 75 మంత్రాలే సామవేదమువి. అథర్వవేదములో సుమారుగా 1200 మంత్రాలు ఋగ్వేదమంత్రాలే. యజుర్వేదములో కూడా కొన్ని ఋక్కులున్నాయి. అందుకే నాలుగు వేదాలలో ఋగ్వేదం ప్రధానము మరియు ప్రథమగణ్యమైనది. **'తస్మాద్యజ్ఞాత్ సర్వహుతః ఋచస్సామాని జజ్ఞిరే'** అను వేదవచనములవలన ఇదియే మొదటిదని తెలియుచున్నది. **''యద్వై యజ్ఞస్య సామ్నా యజుషాక్రియతే శిథిలంతద్ యద్ ఋచాతత్ దృఢమ్"** యజుస్సామముల ప్రయోగముచే యజ్ఞక్రియకు శైథిల్యమేర్పడుననియు, ఋక్ప్రయోగముచే అది సుదృఢముగా సంతరింపబడుననియు చెప్పుటవలన దీని మహత్వమెట్టిదో విశదమగుచున్నది.

ఛందో నియమము కలిగి పాదవ్యవస్థతో కూడియున్న మంత్రాలకు ఋక్కులని పేరు. ఈ ఋక్కుల సంకలనం ఋగ్వేదం. పతంజలి ననుసరించి ఋగ్వేదమునకు 21 శాఖలు. చరణవ్యూహము ననుసరించి వీనిలో శాకల, భాష్కల, శాంఖాయన, మాండూకేయ, ఆశ్వలాయన శాఖలైదును ముఖ్యమైనవి.

నేడు మనకు శాకల శాఖకు చెందిన సంహిత మాత్రమే లభ్యమగుచున్నది. కాగా ఋగ్వేద సంహితయనగా శాకల సంహితయనియే

గ్రహించవలయును. ఋక్సంహిత రెండు విధములుగా విభజింపబడింది. 1. మండలము, 2. అష్టకము. ఋగ్వేదంలో మొత్తం 10 మండలాలు, 856 అనువాకాలు, 1028 సూక్తాలు, 10,580 1/4 మంత్రాలున్నాయి. అష్టక గణన ప్రకారం ఋగ్వేదంలో 8 అష్టకాలు, 64 అధ్యాయాలు, 2009 వర్గలు, ఒక్కోవర్గలో కొన్ని మంత్రాలు ఉంటాయి. కాత్యాయన సర్వానుక్రమణికలో మంత్రములే కాక శబ్దములు అక్షరములు కూడా లెక్కించబడినవి. ఋగ్వేదంలో మొత్తం 1,53826 శబ్దములున్నాయి. 4,32,000 అక్షరములుఉన్నాయి. కలియుగం కాలపరిమాణం కూడా 4 లక్షల 32 వేలే. ఇటుల లెక్కించుట వలన క్రొత్త మంత్రాలేకాదు, కొత్త అక్షరాలు కూడా అదనంగా చేరడానికి అవకాశం లేదు. మన పూర్వజులు వేదరక్షణ విషయంలో ఎంత జాగరూకులై యుండిరో దీన్ని బట్టి తెలియుచున్నది.

అనియత సంఖ్యగల ఋక్కులు ఒక సూక్తం. **"సుస్మూక్తత్వాత్ సర్వం సూక్త మిత్యాఖ్యాయతే"** అని సూక్తాలు 4 విధాలు. ఏక ఋషిద్రష్టమంత్రాల సమూహాన్ని **'ఋషిసూక్తం'** అంటారు. ఏకదేవతా మంత్రాల సమూహాన్ని **'దేవతాసూక్తం'** అంటారు. సమానమైన ఛందస్సులో ఉన్న మంత్రాల సమూహాన్ని **'ఛందస్సూక్తం'** అంటారు. అర్థసమాప్తిగల మంత్రాల యొక్క సమూహాన్ని **'అర్థసూక్తం'** అంటారు. అలాంటి కొన్ని సూక్తాల సమూహం ఒక **'అనువాకం'** అవుతుంది. అలాంటి 85 అనువాకములు 1 మండలం. అట్టి 10 మండలాలు ఋక్ సంహిత.

ఇక ఈ వేదంలోని 10 మండలాల ద్రష్టలను గూర్చి తెలుసుకుందాం. ప్రథమ మండలంలోని మొదటి 10 సూక్తాలకు మధుఛందుడే ఋషి. ఇట్లే ఈ మండలంలోని మరొక 22 మంది ఋషులు ప్రముఖంగా కనబడతారు. ద్వితీయ మండలానికి కృత్సమదుడు, తృతీయమండలానికి విశ్వామిత్రుడు, చతుర్థమండలానికి వామదేవుడు, పంచమ మండలానికి అత్రి, షష్ఠమండలానికి భరద్వాజుడు, సప్తమమండలానికి వశిష్ఠ ఋషి వంశముల వారి పేర్లు కనబడతాయి. అష్టమ మండలాన్ని కణ్వ-అంగీరస గోత్రీకులు దర్శించారు. నవమ మండలంలో 'పవమాన సోమః' దేవతగల చాలా సూక్తాలు ఉన్నాయి. అందుచే ఈ మండలానికి పవమాన సోమమండలమనే పేరు వచ్చింది. వీటిని దర్శించిన ఋషుల పేర్లు మాత్రం వేరువేరుగా కనబడతాయి. దశమ మండలం కూడా వేరువేరు ఋషులు దర్శించినదే. విశేషంగా ఋగ్వేదంలో కొందరు ఋషికల (స్త్రీఋషుల) పేర్లు కనబడతాయి. అంటే వేదకాలంనాడే స్త్రీలు విద్యాభ్యానం చేసి వేదాధ్యయనం చేసేవారన్నమాట. అందులో కొందరు విశేష ప్రజ్ఞ కలిగినవారు యోగాభ్యానం చేసి సమాధిస్థితిలోనికి వెళ్ళి వేదమంత్రార్థదర్శనం చేసి ఆ అర్థాన్ని లోకంలో ప్రచారం చేసారని గ్రహించాలి.

**మండలములు - సంక్షిప్త పరిచయము**

ప్రపంచ వాఙ్మయంలో తలమాణికమైనది ఋగ్వేదం. సృష్టికి మూలభూతమైన తత్వాన్ని సమగ్రంగా ప్రపంచానికి తెలియజేసిన తొలి జ్ఞానజ్యోతి ఋగ్వేదమే. ప్రపంచోత్పత్తిని వర్ణించిన నాసదీయ సూక్తం విశ్వవాఙ్మయానికి శిఖరాయమాణం. తాత్త్విక ప్రపంచానికి అన్ని కాలాల్లోనూ ఆశ్చర్యాన్ని, అభిప్రేరణను అందిస్తున్న విజ్ఞానసింధువు.

ఇక పురుషసూక్తం విశ్వోత్పత్తి రహస్యాన్ని పరమరమణీయంగా వర్ణించింది. జీవుల సముత్పత్తిని, బంధమోక్షాలు, ప్రకృతి రహస్యాలు, వివిధ దేవతల అమూల్య విశేషాలను అసంఖ్యాకంగా ఈ ఆదిమసృష్టి అయిన విజ్ఞాననిధి ప్రబోధిస్తున్నది. అన్నింటినీ మించి

తరువాయి 12వ పేజిలో......




పెద్దలయందు, గురువులయందు, దైవమునందు మనకు గల భక్తిశ్రద్ధలకు, దానగుణానికి, వైజ్ఞానిక పరంపరకు, అద్భుత మేధస్సుకు, అపురూపమైన ఆరోగ్యసూత్రాలకు, ప్రకృతిఆరాధనకు, పశుపక్షాదులపై మనకున్న ప్రేమకు, కృతజ్ఞతా ప్రకటనకు, ఆదర్శంగా పెనవేసుకున్న కుటుంబ సంబంధాలకు ....... వెరసి భారతీయ సంస్కృతికి ప్రతిరూపాలు మన పండుగలు.

అటువంటి పండుగలలో సంక్రాంతి అన్నింటిలోకి ముఖ్యమైన పండుగ. అందుకే దీనిని మనవారు “పెద్దపండుగ” అని వ్యవహరిస్తారు.

దక్షిణాయనానికి వీడ్కోలుగా, ఉత్తరాయణానికి ఆహ్వానంగా మనం జరుపుకునే పండుగ సంక్రాంతి. కాంతి అంటేనే వెలుగు. వెలుగును ఆరాధించే దేశం కాబట్టే 'భా'రత దేశం అయ్యింది. ప్రతి భారతీయుడు చీకటి నుండి వెలుగులోకి రావాలని కోరుకుంటాడు. అందుకే 'తమసోమాజ్యోతిర్గమయ' అంటూ ప్రార్థిస్తాడు. దీపాలను ఆర్పి వెలుగును దూరంచేసుకొని చీకటిలోకి వెళ్లాలని ఏ భారతీయుడూ భావించడు. అందుకే వెలుగును పంచే పండుగ, వెలుగును పెంచే పండుగ అయిన సంక్రాంతి మనకు పెద్దపండుగ అయ్యింది.

దక్షిణాయనంలో సూర్యభగవానుడు భూమధ్యరేఖకు దూరంగా వుండటం చేత చలిపెరిగి అంటువ్యాధులు ప్రబలి అనేక రుగ్మతలకు వాతావరణం కారణం అవుతుంది. ఉత్తరాయణ పుణ్యకాల ప్రవేశంతోనే సూర్యకాంతి క్రమంగా పెరుగుతూ పశుపక్ష్యాదులతో పాటు మనిషి ఆరోగ్యంగా జీవించగలుగుతాడు. సూర్యభగవానునితో ఈ ప్రకృతి మనుగడ ముడిపడి వుంది. సూర్యరశ్మిసోకని గడ్డి మొలక సైతం పత్రహరితం తయారుకాక పసుపురంగులోకి పాలిపోతుంది. ప్రకృతిలో ప్రతి జీవరాశిని పోషించే శక్తి సూర్య కాంతిలో వుంది. అందుకే మన పెద్దలు సూర్యుడు కనిపించని రోజును దుర్దినమని చెప్పారు. అటువంటిరోజు శుభకార్యాలకు పనికిరాదని కూడా చెప్పారు. అంతేకాదు, 'ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్' అంటూ ఆరోగ్యం కావాలంటే సూర్యుని ప్రార్థించమన్నారు. అందుకే ప్రతి హిందువు దినచర్యలో సూర్యనమస్కారం అంతర్భాగమై పోయింది. సూర్యగమనానికి అనుగుణంగా ఈజాతి తన దినచర్యను తీర్చిదిద్దుకుంది. ఆహార విహార వ్యవహారాదులను నిర్దేశించుకుంది. సూర్యోదయానికి రెండుగంటల ముందునుండే సూర్యుని ప్రభావం కనిపిస్తుంది కాబట్టి ఆ సమయంలో నిద్రలేవడం, అలాగే సూర్యాస్తమయం అయ్యాక రెండు గంటల వరకు ఆ ప్రభావం కొనసాగుతుంది కాబట్టి ఆలోపు ఆహారం తీసుకోవడం మన అలవాటుగా వుండేది. విజ్ఞాన శాస్త్రప్రకారం కూడా సూర్యకాంతికి జఠరాగ్నికి దగ్గర సంబంధం వుంటుంది. దీనికి భిన్నంగా ప్రవర్తిస్తున్నాం కాబట్టే స్థూలకాయంతో పాటు అనేక అనారోగ్యసమస్యలు మనల్ని వేధిస్తున్నాయనేది

గుర్తించవలసిన సత్యం.

తిథి వారాలతో సంబంధం లేకుండా జరుపుకునే పండుగ సంక్రాంతి. సూర్యుడు ప్రతినెల ఒక రాశి నుండి మరొక రాశికి ప్రవేశించు సంధి కాలాన్ని "సంక్రాంతి" అంటారు. సూర్యుడు మకర రాశిలో ప్రవేశించే కాలాన్ని మకర సంక్రాంతిగా జరుపుకుంటాము.

సంక్రాంతి నెలపట్టిన నాటి నుండే ప్రతి ఇంటిముందు అందమైన రంగవల్లులు తీర్చిదిద్దబడతాయి. చుక్కలతో అందంగా తీర్చిదిద్దుకునే ముగ్గులు అంతరిక్షంలోని నక్షత్రాల రహస్యాలను ఛేదించిన మన పూర్వులు తమ అద్భుత విజ్ఞానాన్ని ఈ ముగ్గుల్లో తీర్చిదిద్దారా! అన్నంత ఆశ్చర్యంగా వుంటాయి. వేకువనే లేచి యింటి ముందు ఆవుపేడతో కలిపిన నీళ్లు చల్లి దానిపై రంగవల్లులు దిద్దటం మన ఆచారం. సూర్యకాంతి తక్కువగా వుండే ఈ రోజుల్లో అనేక క్రిమికీటకాదులు వ్యాప్తిచెందుతాయి. వాటిని యింటి ఆవరణంలోకి ప్రవేశించకుండా నిరోధించడమే కాక అనేక క్రిములను సంహరించగల శక్తి ఈ నీళ్లకు వుంటుంది. ఆరోగ్యసూత్రాలను పండుగలలో మేళవించి ఆచారంగా చూపడం మన పెద్దల మేధస్సుకు సంకేతం.

హరిదాసుల హరినామస్మరణతో, గంగిరెద్దుల ఆటపాటలతో ఈ నెలరోజులు తెలుగునేల పులకించిపోతుంది.

సంక్రాంతి ముఖ్యంగా మూడు రోజుల పండుగ.

మొదటి రోజు భోగి. భోగి అంటే భోగభాగ్యాలను తెచ్చే, ఇచ్చే పండుగ అని అర్థం. కాయకష్టంచేసి పండించిన పంట రైతు ఇంటికి చేరేకాలమిది. సంవత్సర కష్టాన్ని మరిపించి భోగాన్ని, భాగ్యాన్ని చవిచూసే కాలమిది. రైతే వెన్నెముకగా నమ్మే ఈదేశంలో రైతు సంతోషమే దేశ సంతోషంగా జరుపుకునే పండుగ ఇది.

అంతేకాదు సాక్షాత్తు శ్రీకృష్ణునే భర్తగా పొందదలచిన 'ఆండాళ్' ఆ దేవదేవుని భర్తగా పొందిన శుభదినమే భోగి. వామనరూపంలో పరమాత్మ బలిచక్రవర్తిని పాతాళానికి పంపిన రోజు కావడం విశేషం.

భోగినాడు వేకువనే లేచి అభ్యంగన స్నానం చేస్తారు. పిడకలు, పాతవస్తువులతో భోగిమంటలు వేయడం ఆచారం.

ఈరోజు చిన్నపిల్లలకు రేగిపండ్లు, చిల్లరనాణాలు, చెఱకుముక్కలు, బంతిపూలు కలిపి తలపై నుండి పోయడం ద్వారా వారికి ఆయుర్వృద్ధి జరిగి పీడలు నివారించబడతాయని మన నమ్మకం.

రెండవనాడు సంక్రాంతి. భోగి దక్షిణాయనానికి, ధనుర్మాసానికి చివరిరోజుకాగా సంక్రాంతితో ఉత్తరాయణం ఆరంభమౌతుంది.

సంక్రాంతిరోజు నువ్వుల ముద్దచేసి ఒంటికి రుద్దుకొని స్నానం చేస్తారు. పెద్దలపేరుతో కొత్తధాన్యం, కూరగాయలు, దానం చేయడం, పొంగలిపెట్టడం, నువ్వులు, బెల్లంతో చేసిన ఉండలు, గుమ్మడికాయలు మున్నగువాటితో వంటకాలు చేసుకొని తింటారు.

భూత తృప్తికోసం, పితరుల ప్రీతికోసం పుణ్యలోక ప్రాప్తికోసం, తర్పణాలు వదులుతారు. దానధర్మాలు చేస్తారు. మహారాష్ట్రలో "ఎళ్లు - బెల్లతిందు ఒళేమాతు మాతాడు" (నూగులు - బెల్లం తిని మంచిమాటలు మాట్లాడండి) అని పరస్పరం చెప్పుకుంటారు. క్రొత్త అల్లుళ్లతో, ఆటపాటలతో ప్రతియిల్లూ కోలాహలంగా వుంటుంది.

మూడవరోజు అనగా సంక్రాంతి తరువాత రోజు

కనుమ పండుగ. ఈ పండుగనాడు పశువులను ప్రత్యేకంగా అలంకరించి పూజిస్తారు. వ్యవసాయం చేసే రైతుకు ఎద్దే ధనం. అదే అతని బలం. ఎద్దును పెద్దకొడుకుగా భావించే రైతు కుటుంబాలు నేటికీ ఉన్నాయి. ఈ సంస్కృతిలో వున్న గొప్పతనం ఇదే. తనకోసం కష్టించి తన యింటికి సిరిని తీసుకొని వచ్చే పశువును పెద్దకొడుకులాగా ఆదరించి, అభిమానించి, పోషించటమే కాదు. చివరకు అది తుదిశ్వాస విడిచాక దానిని తన పొలంలో తన పూర్వుల సమాధుల ప్రక్కన పూడ్చిపెట్టటం ఇక్కడ ఆనవాయితీ. నేడు ఆ ఆనవాయితీ మారుతోంది కాబట్టే ప్రకృతి తన వికృత రూపాన్ని చూపి మనల్ని పరిహసిస్తోంది.

తనకు సంపద చేకూర్చే పశుసంపదకు కృతజ్ఞత తెలుపుతూ పూజించే పండుగ కనుమ. నేడు తన యింట వున్న ఎద్దులను, ఆవులను కడిగి, పూలతోను, రంగులతోను అలంకరించి, పూజిస్తారు. యిష్టపదార్థాలను వండి వాటికి తినిపిస్తారు. తన కృతజ్ఞతను ప్రకటిస్తారు. కేవలం పశువులనే కాదు. పక్షుల కొరకు క్రొత్తధాన్యం కంకులను యింటి ముందు వ్రేలాడదీస్తారు. దేవాలయాలలో కొయ్యను నాటి పక్షుల కొరకు కంకులు కట్టే సాంప్రదాయం కూడా వుంది. పూర్వకాలం నుండి పశుపక్ష్యాదులు ఈ జాతి జీవన విధానంలో ఆత్మీయ బంధువులుగా, కుటుంబంలో అంతర్భాగంగా భావించబడ్డాయి. అందుకే 'శం నో అస్తు ద్విపదే, శం చతుష్పదే' అంటూ ఋషివాక్కు పలికింది. రెండుకాళ్ల జీవులు, నాలుగుకాళ్ల జీవులు అన్నీ ఆనందంగా వుండాలి. అన్నీ సంతోషంగా జీవించాలి. భగవంతుడు ఇచ్చిన ఆయుష్షును అవి పరిపూర్ణంగా అనుభవించాలి. అదే కనుమ పండుగలోని పరమార్థం.

---

9 వ పేజి తరువాయి ......

ఆశ్రమవ్యవస్థ, ఆయుర్వేదం, ఆకాశయాన విజ్ఞానం వంటివి ఈ ఋగ్వేదంలో ప్రత్యేకంగా గోచరిస్తాయి.

వైజ్ఞానిక రంగంలో చాలా ముందుకు పోయామన్న ఈ కాలపు విజ్ఞానానికంటే ముందే అనేక విషయాలు ఋఙ్మంత్రాల్లో గొప్పగా కనబడతాయి. మనకు అర్థంకానివన్నీ ఆనాటి వారి అనాగరికతకు తార్కాణాలనుకోవడం సముచితం కాదు. ఈ మంత్రాలకు సంబంధించిన సరైన అర్థాన్ని అవగాహన చేసుకొనడానికి వైజ్ఞానికంగా ఇంకా పురోగమించాలి.

ఋక్సంహితలోని విషయాలను అన్ని దృక్పథాలనుంచి పరిశీలించటం ప్రస్తుతం కానిపని. కాబట్టి అందరికీ సులభంగా అర్థమయ్యేవి, ఎంతో కొంత దేశకాలానుసారంగా అందరికీ ఆసక్తిని పెంపొందించేవి మండలాలవారిగా కొన్ని మాత్రమే ఇక్కడ పేర్కొనబడతాయి. దీనినే కొలబద్దగా తీసుకొని వేదంలో ఉండే విషయాలు ఇంతమాత్రమేనా ? అని భ్రమపడరాదు. సమీక్షకోసం కొన్నింటిని మాత్రమే ఇక్కడ ప్రస్తావించడమైనది.

శాకల్యశాఖకు చెందిన ఈ ఋగ్వేద సంహిత వైదిక సంప్రదాయములో సర్వోత్కృష్టమైన ఆదరాన్ని పొందుతున్నది. ఇది పది మండలాలని ముందే వివరించబడింది. ఇక మండలాల వారిగా అందులోని సారాంశం అత్యంత సంక్షిప్తంగా వివరించబడును.

మొదటి మండలం.

ఉన్నతంగా ఆలోచిస్తూ బ్రతికే వారి కెన్నడూ ఒంటరితనం అంటూ ఉండదు. వారి ఆలోచనలే వారి ప్రియనేస్తాలు

శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాములవారి రచనల్లో విశిష్ట రచన

# వీరకాళికాంబా శతకము

భావచ్ఛందోऽనుసరణ: కీ.శే. డా|| వి.వి.యల్.నరసింహారావు (కందిమల్లయ్యపల్లి) బ్రహ్మంగారి మఠం ఆస్థాన కవి

## ధర్మము - కర్మము

**అండ అసలు చేసి కుండ కుదురుచేసి**
**రాను పోను ఒక్క రథము చేసి**
**రథము చీల లైదు పదిరకములు చేసి**
**కాళికాంబ! వీరకాళికాంబ! 378**

అండ అంటే ఆశ్రయం. అసలు అంటే అడుసు. అడుసు మట్టినే ఆధారంగా తీసుకొని, అదే మూలద్రవ్యంగా స్థిరంగా కుండ తయారుచేస్తాడు కుండకారుడు. దానిని కుదురుగా స్థిరంగా ఉండేట్లు చేస్తాడు. కుండనే ఘటం అని కూడా అంటారు. ఘటమంటే జీవి దేహమని కూడా లౌకికార్థం. 'ఈ ఘటం ఇట్లా తెల్లవారిపోనీ!' అని అంటే "ప్రాణంతో కూడిన ఈ దేహం ఇట్లా కడచిపోనీ!" అని అర్థం. జీవి ఘటాన్ని సృష్టించేవాడు భగవంతుడే.

ఈ దేహానికే తాత్త్వికంగా రథమనికూడా అర్థం ఉంది. శరీరం రథమైతే శరీరి అయిన జీవుడు రథి అవుతున్నాడు. ఈ దేహరథాన్ని నిర్మించే రథకారుడు భగవంతుడైన విశ్వకర్మయే "ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవతు" అని కఠోపనిషత్ తృతీయావల్లిలో ఉంది.

శరీరమయ రథాన్నే దేహమయ రథం అంటారు. ఆత్మ వచ్చి పోవటానికి పరమాత్మ ఈ రథం సృష్టిస్తాడు. ఈ రథానికి అయిదు చీలలు. ఇవి ప్రకృతిలోని పంచభూతాలు. దేహం పంచభూతాత్మకమే కదా! పృథివ్యప్తేజోవాయురాకాశాత్మకమే దేహం. ఈ దేహానికి జ్ఞానేంద్రియాలైదు - త్వక్చక్షుశ్శ్రోత్రజిహ్వా ఘ్రాణములు. అట్లాగే కర్మేంద్రియాలైదు - వాక్పాణి పాదపాయు ఉపస్థములు రథము చీలలైదు పది రకములు చేసె నంటే విశ్వకర్మరథకారుడు జీవుల దేహరథ నిర్మాణంలో రథగమనం క్షేమంగా ఉండటానికి అమర్చిన చీలలు ఈ పదిహేను అని బ్రహ్మేంద్రుల అభిప్రాయం.

**ఆర్గురు రథకారు, అందు ముగ్గురు కల,**
**రేడ్గు రుండ వ్యథల కిరువు కొంప**
**అయిదుగురు గలట్టి దంత చింతే నయా**
**కాళికాంబ! వీరకాళికాంబ! 379**

ప్రధాన రథకారుడు విశ్వకర్మభగవాను డనుకొన్నాం. శిల్ప మూలద్రవ్యాన్ని అనుసరించి దారుశిల్పి, స్వర్ణశిల్పి, శిలాశిల్పి, అయశ్శిల్పి, లోహశిల్పి అని అయిదుగు రథకారులున్నట్లు శిల్పశాస్త్రం పేర్కొన్నది.

"దారుకారః స్వర్ణకారః శిలాకార స్తథైవచ అయస్కారో లోహకారః పంచైతే రథకారకాః"

"దేశికో రథకారణం విశ్వకర్మామహాతపాః" అని చెప్పబడుట దేశిక రథకారుడు దారుకారాది పంచరథ కారులతో కలిసి ఆర్గురు రథకారు లవుతున్నారు. 'అందు ముగ్గురు కలరు' అంటే - "స్థపతిః స్థాపకశ్చైవ ఆచార్యో విశ్వకర్మణః" అని స్థపతి అనీ, స్థాపకుడనీ, 'ఆచార్యు'డనీ ముగ్గురు ప్రసక్తులౌతున్నారు. వీరు ముగ్గురూ రథకారులే. చేసే పనిని బట్టి వీరికీపేర్లు స్థిరపరచారు శిల్పశాస్త్రంలో. స్థపతి శిల్పి, స్థాపకుడు నిర్దేశకుడు, ఆచార్యుడు శిక్షకుడు. గురుస్థానీయుడు.

వ్యథలు విచారాలు కల జీవుడి దేహగృహంలో ఏడుగురు ప్రమాదవ్యక్తులున్నారు. వారే సప్తవ్యసనాలు. పానము, స్త్రీ, వేట, జూదము, అనే నాలుగు కామ జనితాలు. వాక్పారుష్యం, దండపారుష్యం (దండించే తీవ్రత) అర్థదూషణం అనేవి కోపజనితాలు అన్నింటినీ కలిపి సప్తవ్యసనా లంటారు. పంచభూతాత్మకదేహానికి అన్నీ చింతలే.

**చిత్తు పరిహరించి, సత్తును సాధించి**
**మత్తు పోనడంచి మాయ తెలిసి**
**మిత్తియుండు నెలవు 'మీరులు తెలియుడీ**
**కాళికాంబ! వీరకాళికాంబ! 380**

'చిత్తు' అంటే చిత్తుప్రతి అని వ్యవహారంలో ఒక అర్థం ఉంది. Rough copy అని భావం. ఇటువంటి దానిని ప్రమాణంగా తీసుకోరాదు. దీన్ని విడిచి పరిష్కృతమైన నిర్దుష్టప్రతినే పాఠకుడు గ్రహించాలి. 'చిత్తు' అంటే జ్ఞానమనే అర్థం ఇక్కడ గ్రహించనక్కర లేదు. 'సత్తు' అంటే 'సత్వ'మనీ, 'సత్య'మనీ అర్థం. దానిని జీవుడు సాధించాలి. సత్వమంటే శారీరక, మానసిక బలమనే అర్థం కాకుండా సాత్వికతా లక్షణ మని కూడా అర్థం. దాన్ని కూడా జీవుడు సాధించాలి. ఇవి సాధిస్తే క్రమంగా మత్తు మాంద్యం వదలిపోతాయి. మాయమర్మాలు తెలుస్తాయి. అంతేకాదు. మనం తెలుసుకోవలసింది ముఖ్యంగా మృత్యువు కాచి ఉండే తావు మిత్తి వుండు నెలవు అంటే అదే. దాన్ని తెలుసుకోండని ప్రబోధిస్తున్నారు గురుదేవులు.

**మిత్తి నెత్తి మీద కత్తి నూరుచు నుండె**
**కోతులుండునట్టి కొలువు నందు**
**దస్తు తెలిసి నరులు శిస్తులు కట్టుడీ**
**కాళికాంబ! వీరకాళికాంబ! 381**

మృత్యువు మనల్ని మింగటానికి ఎప్పుడూ కత్తి నూరుతూనే ఉంటుంది. దానికి తగినట్లు మానవ స్వభావం కోతి స్వభావంవలె చపలమైంది. మృత్యువుకి ఇది మరింత అనుకూలమైన పరిస్థితి. మనం ధర్మంగా నడచుకోవాలి. ఎడాపెడా రెండు చేతులతో డబ్బు సంపాదించుకొన్నా కట్టవలసిన శిస్తు పన్నులు ఎగవేసే పని చేయ్యకూడదు. ఆ పని అధర్మంగా చెయ్యటం వల్ల మృత్యువుకు మనం మరింత లోకువై పోతాం. అంటే చావు ముంచుకొస్తుందని భావం. గురుదేవుల హెచ్చరిక చాల గొప్పది.

**మంచి త్రుంచి, విడచి మానాభిమానముల్**
**దానధర్మ బాధ దగులనీక**
**నక్కవినయములనె నడచునా బ్రతుకులు?**
**కాళికాంబ! వీరకాళికాంబ! 382**

సన్మార్గం విడనాడి, గౌరవ మర్యాదలు గంగలో కలిపి దానధర్మాలు బాధాకరాలని వాటిని దగ్గరకు రానీకుండా కపటబుద్ధితో దొంగనియమం ప్రదర్శిస్తూ పోతే బ్రతుకులు ఎన్నాళ్లు సవ్యంగా నడుస్తాయి. నక్క వినయం బయటపడి తీరుతుంది. భంగపాటు తప్పదు. ఇదెంత మాత్రం మంచిదికాదు.

**సందు తెలియలేక నిందలపాలయి**
**వందనం బెరుగక వంచకులగు**
**పందనరులు యముని బారి గొఱ్ఱెలు కదా!**
**కాళికాంబ! వీరకాళికాంబ! 383**

'సందు' అంటే చిన్నిత్రోవ. ఉపాయం వంటి దగ్గరి దారి. దీన్ని తెలుసుకోలేక అపవాదులపాలై వినయ విధేయతలు లేకుండా మోసమే జీవనంగా బ్రతికే పిరికి మనుజులు యమధర్మరాజు దృష్టిలో గొఱ్ఱెదాటు వేసే శిక్షార్హులైన జీవులు. వారిని యముడు చీల్చి చెండాడక వదలడు. ఇది తెలిసి జీవులు తమ నీతి వర్తనాన్ని చక్కదిద్దుకోవాలని **తరువాయి 16వ పేజిలో......**

# వ్యవహారము - ఆధారము

....... ప్రా॥ జి.వి. శేషారెడ్డి .......

ప్రకృతి వ్యవహారమైతే దైవం ఆధారం వ్యవహారం ప్రాపంచికం, ఆధారం ఆధ్యాత్మికం ప్రాపంచిక విషయము ఏదైన వ్యవహారములో కూడి ఉంటుంది. కాని ఆధారం వ్యవహారాన్ని ప్రాపంచికమువైపు తీసుకొని పోయింది. ప్రతి జీవికి ఆధారం దైవం, కాని ప్రతిజీవి ఆత్రం వ్యవహారం. ప్రతి జీవి పుట్టుక చావు వ్యవహారికం. పుట్టుకలోని సార్థకతను తెలుసుకోవా లంటే పుట్టుకకు ఆధారమైన భగవతే ప్రేరణ ఆధారం. వ్యవహారాన్ని ఆధారం లేకుండ పరిష్కరించలేము.

మానవుని జీవితం వ్యవహారము 'జీవిత పరమార్థం కోసం సృష్టికి ఆధారమయిన దైవం, కరుణ, కటాక్షం తద్యం. వ్యవహారికం పరిపక్వత దిశకు చెందాలంటే ఆధారం అవసరం. ఆ ఆధారం అధ్యాత్మికం మమతానురాగం వ్యవహారికం, ప్రాపంచికం సేవాభావం దైవికం. సేవాభావం మానవత్వం అయితే దానికి ఆధారం దైవత్వం, స్వార్థం వ్యవహారికం, ప్రాపంచికం. స్వార్థాన్ని నిస్వార్థంగా మార్చుకోవడం పరమార్థం. ఈ పరమార్థానికి ఆధారం దైవ చింతన. దైవం అనే ఆధారం మన వ్యవహారిక జీవితాన్ని పునీతం చేయడానికి ఆధ్యాత్మికత ఆలోచన అవసరం. ఆది అంతం వ్యవహారికం. ఆదికైన, అంతానికైన దైవం కారకం ఆధారం.

కృష్ణ భగవానుడు భగవత్‌గీతలో వ్యవహారికాన్ని అర్జునునికి విశ్లేషించి కార్యోన్ముకున్ని గావించి ధర్మాన్ని కాపాడేటట్లు చేసి ఈ సృష్టికి మూలం, ఆధారం నేనే అన్న విషయాన్ని విశ్వరూపాన్ని ప్రదర్శించి తెలియచేయలేదా ! మానవ జన్మకు వ్యవహారికానికి అవినాభావ సంబంధమని, వ్యవహారిక జీవితాన్ని బాధ్యతాయుతంగా పూర్తి చేసి, నాలో కలిసిపోవడమే మానవ జన్మకు సార్థకం అని కృష్ణ భగవానుడు గీతలో కర్మ సిద్ధాంతాన్ని అర్జునునికి బోధించి ఈ లోకానికి ఆధారం "నేనే" అన్నాడు కదా !

ఆధారం లేని వ్యవహారముండదు. వ్యవహారం అశాశ్వతం. ఆధారం శాశ్వతం. ఆధారమైన శాశ్వతాన్ని తెలుసుకోవడమే ఆధ్యాత్మికం. దైవం జన్మలలో అన్నిటికన్న మానవజన్మను ప్రసాదించింది ఆధారాన్ని గమనించి జన్మకు సార్థకత తెలుసుకోమని, ఆధారమైన దైవాన్ని ప్రసన్నము చేసుకోవాలంటే మానవుడు "మానవ సేవే మాధవ సేవ" అన్న తాత్వికాన్ని అలవరచుకోవాలి. జీసస్ (క్రీస్తు), బుద్ధ భగవానుడు, జైన మహావీరుడు, శ్రీరామకృష్ణ పరమహంస, అరవిందుడు, శ్రీకృష్ణుడు, మహమ్మద్ ప్రవక్త, వివేకానందుడు, అరిస్టాటిల్, ప్లాటో, సోక్రటీస్, వేమన, కబీర్‌దాస్‌ల బోధనలోని సారాంశము ఇదే కదా! ప్రతి మతం యొక్క అభిమతం మానవత్వమే. దాన్ని మానవుడు తెలుసుకో లేక సంకుచితత్వంతో తానున్న మతం గొప్పదని భావించడం అమాయకత్వం. ఏ మతానికైన ఆధారం దైవం. మానవ దేహం పాంచబేధికం. ఓదల శరీరానికి పంచభూతాలు ఆధారం. పంచభూతాలకు సృష్టి కర్త ఆధారం. ఈ కార్యక్రమం అంతా వ్యవహారం . అందుకే వ్యవహారికం అశాశ్వతం. ఈ వ్యవహారికానికి ఆధారమైన భగవానుడు మాత్రమే శాశ్వతం.

పరిస్థితికి ఆధారం కర్మ, ఆలోచనకు ఆధారం పరిస్థితి. ఆలోచనకు ఆధారం విశ్లేషణ. విశ్లేషణకు ఆధారం సమీక్ష. పరిస్థితి, ఆలోచన, విశ్లేషణలు వ్యవహారికాలు. పరిస్థితి, ఆలోచన, విశ్లేషణలకు

ఆధారం వేదాంతం ప్రాపంచికం నుంచి ఆధ్యాత్మికం వైపు పయనించడానికి ఆధారం కర్మ సిద్ధాంతం. విజ్ఞానం ఎంత పెరిగిన భౌతికంగా ఎంతో ఉన్నతిని పొందిన మానవుని ఉనికి మాత్రం వ్యవహారికం, చివరికి ఆధ్యాత్మికమునే ఆధారంతో స్వర్గం అనే గమ్యాన్ని చేరవలసిందే.

ఈ భౌతిక ప్రపంచములో అణువణువు వ్యవహారికమే! అయితే అణువుకు శ్రీకారం చుట్టిన ఆధారం మాత్రం దైవం. దేవుడు మానవుని సృష్టించినపుడే మానవత్వం అనే ఆధారముతో దైవత్వాన్ని పొందు అని బ్రహ్మరాత వ్రాసి భువికి పంపాడు "ఇదం శరీరం పరోపకారం" ఈ శరీరానికి సార్థకత పరోపకారం అనే ఆదారము అవసరము.

చెట్టుకు విత్తు ఆధారం. మనిషికి మనసు ఆధారం. మనసుకు ఆలోచనలు ఆధారం. వ్యవహారికము ఏదైనా ఆధారం మాత్రమే ఆధ్యాత్మికం వైపు వెళ్ళడానికి, దైవం ప్రతి జీవికి కర్మ సిద్ధాంతాన్ని అన్వయించి జన్మను ఇవ్వడం సహజం. ఈ రోజు మానవుడు గడుపుతున్న జీవనానికి మూలం ఆధారం కర్మ సిద్ధాంత ఫలితమే! మానవుడు తనజన్మను ప్రాపంచికము శాశ్వతమనే భ్రమలో పడి ఎలాంటి కార్యక్రమాలు చేస్తే జన్మ సార్థకం అవుతుందో తెలుసుకోలేకపోవడం శోచనీయం. జన్మసార్థకతకు ఆధారం తెలిసికూడ వ్యవహారికానికి ప్రాకులాడి మరొక జన్మకు నాంది పలుకుచున్నాడు.

పంచభూత మిళితమైన ఈ శరీరానికి ఆధారము జలం, అగ్ని, వాయువు, భూమి, పంచభూతాలు మనకు కనిపించే ప్రత్యక్షదైవాలు. పంచభూతాలు నిస్వార్థ సహాయకులు. జలం, అగ్ని, వాయువు, భూమి కలిసి నిర్వహణకు కొనసాగిస్తేనే సృష్టిలోని ప్రతి జీవి జీవనాన్ని సాగిస్తుంది. మానవులకు నిస్వార్థ సేవ ఎలాంటిదో పంచభూతాలు తెలియచేసిన తెలుసుకోలేక స్వార్థ పూరితమైన ప్రతి నిమిషము మానసిక యాతన అనుభవిస్తున్నాడు. ప్రతి మానవుడు గొప్పవాడే తన ఉనికి ఏమిటో ఈ భూమి మీద తెలుసుకొన్నపుడు, తెలుసుకొనుటకు ఆధారమైన తెలివిని విజ్ఞతను కూడ దైవం ప్రసాధించడం. కానీ మానవుడు వ్యవహారికంగా ఆలోచించి తెలివి, విజేతల ప్రచారాన్ని అమాయకత్వం అనే బూడిద కప్పివేసినట్లు తెలుసుకోలేకపోవడం శోచనీయం.

బ్రతుకు పోరాటం వ్యవహారికం. ఈ పోరాటం విజయవంతం కావడానికి ఆధారం వేదాంతం. వేదాంత సారాంశం, ప్రేమతత్వంతో కూడిన పరోపకారం. మానవత్వం విత్తు అయితే ప్రేమతత్వం, దైవత్వం ఫలాలు. "Where love is there God is" అన్నాడు హల్‌స్థాయి. ఎక్కడ ప్రేమతత్వం తాండవిస్తుందో అక్కడ దైవం విలాసం ఉంటుంది. అదే వేదాంతరహస్యం.

---

**14వ పేజి తరువాయి ......** గురుదేవుని ప్రబోధం.

**దారి గడచువాడె వీరు డనందగు**
**దారి తెలియువాడె ధర్మవర్తి**
**కోరి వాని జూచు కారణపురుషుండు**
**కాళికాంబ! వీరకాళికాంబ! 384**

ఈ ప్రకరణం ధర్మకర్మములతో మొదలైంది. దీన్ని ధర్మవర్తనంతోనే ముగుస్తున్నాడు గురుదేవుడు.

మార్గం తెలుసుకొని ముందుకు పోగలవాడే వీరుడు. అతనినే ధర్మవర్తకుడని కూడా అంటారు. అటువంటి ధర్మవీరుణ్ణి చూచేందుకు కారణజన్ములైన మహాపురుషులు ఇష్టపడతారట.

స్వామి శ్రీవీరబ్రహ్మేంద్రుడు ఇటువంటి కారణ జన్ముడే. ఆయన ఆసక్తి ధర్మవీరుల పట్లనే వుందని ఈ పద్యం ఉద్ఘాటిస్తున్నది.

రానున్న నవపద్యాలలో స్వామివారు విగ్రహపూజ ను గూర్చి వివరించబోతున్నారు. -సశేషం-

# జపతో నాస్తి పాతకమ్

బ్రహ్మ శ్రీబొడ్డు పల్లి పవన్ కుమార్ అవధాని

సనాతులు కృతయుగాన తపస్సు చేసి భగవత్సాన్నిధ్యాన్ని పొందినారు. త్రేతాయుగమందు యజ్ఞం చేసి మోక్ష పదాన్ని పొందినారు. ద్వాపర యుగములో ధర్మము నాచరించి భగవత్ కటాక్షమునకు పాత్రులయ్యారు. ఈ కలియుగమునందు కేవలం నామజపము వల్లనే దైవసాన్నిధ్యం పొందగలరని సనాతన ధర్మం ప్రవచిస్తోంది.

యజ్ఞానాం జపయజ్ఞోస్మి యజ్ఞాలన్నింటిలోనూ నేను జప యజ్ఞమును అని గీతా పాఠంలో శ్రీకృష్ణ పరమాత్మ తెలిపినాడు. ఈ కలియుగంలో శాంతి, ఆనందము, తృప్తి, అమరత్వము ఇవ్వగల శక్తి జపానికేగలదు. ఏకాగ్రతతో, ధ్యానంతో, నిష్ఠతో, నైర్మల్యముతో భగవన్నామస్మరణ చేయుటయే జపము. జప, యోగం ద్వారా దైవకృపను పొందగలుగుట నేటి కలియుగ జీవులందరికినీ ఆచరణ యోగ్యమైనది. సులభకరమైనది కూడానూ. జపయోగాన్ని మించిన యోగం వేరొకటి లేనేలేదు. మంత్రమును, లేదా నామాన్ని పునరావృతము చేయుటయే జపము.

ఓం మంత్ర జపము సగుణ, నిర్గుణ బ్రహ్మోపాసనకు ఎల్లరకునూ ఆచరణ యోగ్యమైనది. జపము, ధ్యానము విడదీయరానివి. ధ్యానములేని జపము నిష్ప్రయోజనము, చేయుజపము భావ సహితమై యుండవలెను. భక్తి విశ్వాసాలతో చేయవలెను. పలికెడు శబ్దమునర్థము చేసి కొనియే జపించవలెను. మంత్ర జపము ఇహపర సుఖశాంతులనే గాక ఆత్మానందాన్ని ప్రసాదించును. జ్ఞానాన్ని కలుగ జేయును, చైతన్యశక్తిని శరీరమున నింపును, కామక్రోధాది అరిషడ్వర్గాలను దూరం చేయును. హృదయ మాలిన్యమును తొలగించును. నామ జపం వలన కలుగు బ్రహ్మానందము అనుభవైక వేద్యము లభించు సంస్కార సంపద నిరుపమానము.

అజామిళుడంటి మహాపాపాత్ముడు సైతం హరినామ జపం చేసి ముక్తిని పొందగలిగాడు. భోగము స్త్రీయగు సింగళ తన పెంపుడు చిలుక పదే పదే పలికిన రామ శబ్దాన్ని అనుదినం వినటం వల్ల భావసమాధి పొందినది. అట్లే ప్రహ్లాదుడు, అంబరీషుడు, ధృవుడు, కబీరు, తులసీదాసు, రామదాసు, తుకారాం, మీరా వంటి భక్తపుంగవులెందరో నామ స్మరణముచే తరించిరి.

జపము మనస్సును సాంసారిక వ్యామోహాల వైపు పరుగులిడకుండా చేస్తుంది. ఈశ్వరుని కొరకు మోక్షానంద ప్రాప్తి కొరకు ప్రయత్నం చేయ ప్రేరేపిస్తుంది. అంతర్వీక్షను పెంచుతుంది. బాహ్య విషయ వికారాల నుండి దృష్టిని మరల్చుతుంది. ఆత్మ స్థైర్యము కలిగిస్తుంది. సత్కార్యాచరణ సంకల్ప సిద్ధికిదోహదం చేస్తుంది. సాధకుని భావాలు పరిశుద్ధమవుతాయి. రాక్షస గుణాలు దూరమై దైవీ సంపత్తి లభిస్తుంది. ఆధ్యాత్మికప్రకాశం పెంపొందించగా ఐహిక చింతన దూరమవుతుంది. జపము సమస్త ధర్మాలను అనుసరింప

ప్రోత్సహిస్తుంది. పరిశుద్ధమనస్కుడైన మనుజుడు జపం చేసిన సాలోక్య, సామీప్య, సాయుజ్యాలను పొందగలడు.

జపములన్నింటి యందు గాయత్రీ జపం మహోత్కృష్టమైనదని శాస్త్రాల ఉవాచ, త్రివిధతాపాలను త్రోసి రాజని, ధర్మార్ధ, కామ మోక్షాలిడి, అవిద్యను, అజ్ఞానాన్ని రూపుమాపి అష్ట సిద్ధులు ప్రసాదించి, సకల పాప పరిహారం కావించి మానవుని శక్తివంతుడిని చేసి, మహోన్నత దిశకు గొనిపోవు మహిమ వేదమాతయగు గాయత్రి గలదు. జపమునందు వివిధ దేవతల, దైవముల నామాలు జపించుట జరుగుతుంది. హరిః ఓం, ఓం నమో భగవతే వాసుదేవాయ, నారాయణాయ ఓం నమః శివాయ, సాయిరాం, హరే రామ హరేకృష్ణ, ఓం దుర్గాయైనమః, ఓం హ్రీం క్లీం శివాయ వీరబ్రహ్మణే నమః మున్నగు నామాదులతో జపం చేయుదురు.

బయటకు వినిపించునట్లు, పెదవులపై నిశ్శబ్దముగా పలుకుచూ, లేదా కేవలం మనస్సునందే మననం చేసుకొనుటయు, జప విధానములు చేతి వ్రేళ్ళ గణుపులతో, పూసలతో, రుద్రాక్షపగడముత్య పు మాలతోనూ గణించుకొనుచూ జపం చేయవచ్చు. ఏ విధంగా చేసిననూ మానసిక నిష్ఠ జపానికి ప్రధానము. ఆంతరిక ప్రేమ పరమేశ్వర వియోగ దుఃఖం అనుభవించుచూ నామ జపం చేయాలి. మూలబంధంతో జపాన్ని ఆచరించాలి. కుంభకము అనే విధానం ద్వారా వీలున్నంతసేపు శ్వాసను ఆపుచూ, నెమ్మదిగా వదులుచూ, ప్రాణాయామం చేయుచూ జపమొనరించాలి. ఉపాంశువు, మానసికం అను ప్రధానమైన జపం ప్రయోజనకరములు భక్తుడు లిఖిత జపాన్ని కూడా చేయవచ్చు. రామకోటి ఇత్యాదులు ఈ కోవలోకే వస్తాయి.

దిక్కులు చూడక, పరులతో సంభాషించక మౌనంగా ఒకే ఆసనంపై కూర్చొండి, ప్రతి దినం ఒకే సమయమున స్నానాది కృత్యములు ముగించుకొని జపం చేయాలి. ప్రతి దినం ఇన్ని మార్లు జపమాచరించాలను నియమం పెట్టుకోవాలి. రోజుకొక మంత్రాన్ని మార్చకుండా సర్వదా ఒకే మంత్రమందు విశ్వాసముంచి జపం చేయాలి. మోక్షార్థులై నిష్కామముగా జపం చేయువారి కెట్టి నియమాలు లేవు. ఏ వేళ, ఎక్కడ ఏ స్థితిలోవున్నా జపం చేయవచ్చును. సూర్యోదయం, మధ్యాహ్నం సూర్యాస్తమయములందే జపం చేయాలి. ప్రాణాయామం చేసిన, ఆపై జపం చేసిన ఏకాగ్రత చేకూరుతుంది. ఏ నామ జపమైననూ కనీసం 108 సార్లు చేయాలి. నామ జప మహిమ గురించి సుప్రసిద్ధులైన ప్రముఖులెందరో తమ అభిప్రాయాన్ని తెలిపినారు.

ఈ కలియుగమునందు అన్ని బాధలను హరినామ స్మరణచే నివారించవచ్చును. - పూజ్యులు శ్రీ రామకృష్ణ పరమ హంస

రామనామ జపంచేత సుఖశాంతులు, అమరత్వము పొందవచ్చును - గోస్వామి భక్త తులసీదాసు.

నామ మహిమను వర్ణింపగా అసాధ్యం. దానిని భక్తి, విశ్వాసము, అనుభవ పూర్వకంగానే తెలుసుకోవాలి. - జాతిపిత మహాత్మాగాంధీ.

భక్తవరేణ్యులు, సాధు పుంగవులు అనంతకోటి నామధేయుడు, అఖిలాండ కోటిబ్రహ్మాండ నాయకుడు అయిన ఆ పరమాత్మకు చెందిన ఏదేని నామమును సర్వదా జపించుచూ ఐహిక వాంఛా దూరులై సుఖశాంతులు, ఆయురారోగ్య, ఐశ్వర్యాదులు పొందెదరు గాక.

భారతీయ ప్రతిభా పాటవాలు

# కౌటిల్యుడు - అర్థశాస్త్రం

సంకలనం: శ్రీ వివేకానంద లైఫ్ స్కిల్స్ అకాడమీ, ప్లాట్ నెం. 1, వెంకట్రామ నగర్ కాలనీ, ట్రాన్స్‌పోర్ట్ రోడ్డు, కార్ఖానా, సికింద్రాబాద్ - 09. ఫోన్ : 040/27892105

**విదేశీనీతి - పరిపాలన**

అర్థశాస్త్రంలో కౌటిల్యుడు 'ఆరు' విధాలుగా పొరుగు రాజ్యాలతో వ్యవహరించే విధానం తెలిపాడు. అవి 1 . సంధి, 2. విగ్రహం, 3. ఆసనం, 4 యానం, 5 సంశ్రేయం, 6. ద్వైధీభావం. దీనినే షాడ్గుణ్యమ్ అని సంబోధించారు.

6.2.1 "ఒక దేశం యొక్క సురక్షత (Safety) అది పాటించే విదేశీ విధానంపై ఆధారపడి ఉంటుంది.

7.13.33 'శత్రు శేషాన్ని' మిగల్చరాదు. అందుకు ఎంత మంది చనిపోయినా, ఎంత ధనం ఖర్చయినా, ఎన్ని ఆస్తులు ధ్వంసమైనా వెనుకాడరాదు.

7.14.18, 19 'బలహీనుడైన' రాజు ప్రజోపయోగ కార్యక్రమాల ద్వారా బలం పుంజుకోవాలి. ఆ బలం ఎక్కడ నుండి వస్తుందంటే జానపదులు (Villagers) నుంచీ లభిస్తుంది.

7.15.13-20, 12.1.1-9 'ఎవరూ హీనంగా శత్రువుకు లొంగిపోకూడదు. అలాగే మూర్ఖంగా.

వీరోచితం అంటూ తనని తాను త్యాగం చేసుకోగూడదు. తాను బతికి ఉండి, అదనుచూసి శత్రువుపై దాడిచేయటం చేయాలి.

7.17.1,2 'సంధి చేసుకోవటం', 'శత్రురాజ్య విషయాలలో జోక్యం చేసుకోకుండా ఉండడం 'శాంతికోసం - బందీలను విడుదల చేయటం' వంటి ఈ మూడింటి ఉద్దేశం ఒకటే. అవి శత్రుదేశ పాలకులలో నమ్మకం కలిగించటానికి తీసుకునే చర్యలు.

7.9.9-12 రెండు మిత్రపక్షాల మధ్య ఎన్నిక చేసుకోవాల్సి వచ్చినప్పుడు - ఎవరినైతే మనం నియంత్రించగల అవకాశం ఉంటుందో అట్టి వారితో స్నేహం చేయాలి. స్నేహం అసలు ఉద్దేశం సహాయం పొందటమే.

7.9.13-17 ఎవరి వలననైతే మనకు నిరంతరం సహాయం అందుతుందో ఆ సహాయం చిన్నదైనప్పటికీ, అటువంటి వారితో స్నేహం చేయటం మంచిది. తాత్కాలికమైన గొప్ప సహాయం పొందటం కన్నా చిన్నదైనా, నిరంతర సహాయం పొందటం మంచిది. ఈ దృష్టితోనే మిత్ర పక్షాలను ఎంచుకోవాలి.

7.9.18-21 ఎవరైతే తన సైన్యాన్ని, వనరులనూ అతి తొందరగా మోహరించగలరో, వారినే మిత్ర పక్షంగా ఎన్నుకోవాలి. వారికి అంత బలం లేకపోయినా ఫరవాలేదు. ఎందుకంటే అవకాశాన్ని జార విడుచుకోకూడదు.

7.9.26-30 సైన్యాని కంటే ధనసాయం చేసే వారినే తాను మిత్రపక్షంగా ఎంచుకోవాలి. ఎందుకంటే సైన్యం అన్ని వేళలా పనికిరాదు. డబ్బు ఎక్కడైనా అక్కరకొస్తుంది.

7.18 శత్రువుని జయించిన తరువాత, మిత్రపక్షం శక్తివంతమై తనతోనే పోరుచేసే అవకాశం ఉంది. అందువల్లా మొదటి నుంచే తగు జాగ్రత్తలు తీసుకుని మిత్రపక్షం అణుకువగా ఉండేలా చర్యలు తీసుకోవాలి.

తరువాయి 23వ పేజిలో......




(గత సంచిక తరువాయి)

## భక్తి పరీక్ష

తన్ను సేవిస్తున్న దిలీపుని భక్తిని పరీక్షించగోరి మునీంద్రుని హోమధేనువు ఆ మరునాడు గంగా ప్రవాహం చెంత లేతపచ్చిక దట్టంగా పెరిగివున్న హిమాలయ గుహలో ప్రవేశించింది. క్రూరమృగాలు ఆ గోవుపట్ల మనసులో కూడ కీడు తలపెట్టవన్న నమ్మకంతో రాజు ఒక క్షణకాలం అక్కడి ప్రకృతిదృశ్యంవైపు చూపు మళ్ళించాడు. ఇంతలో అతని కనుగప్పి ఒక సింహం హఠాత్తుగా అక్కడికి లంఘించి ఆవును బట్టి బలవంతంగా ఈడ్వసాగింది. ఆ శబ్దం వింటూనే దీనరక్షకుడైన రాజు తటాలున పగ్గంతో లాగినట్లు తన చూపును కొండవైపు నుండి ఆవువైపు మరలించాడు. గైరికాదిధాతుమయ మైన కొండపై పూచిన లొద్దుగు చెట్టులాగా ఎఱ్ఱని నందినీ ధేనువుపై తెల్లని జూలుగల సింహం ఆ విలుకానికి కనిపించింది.

సింహగమనుడూ, ఆర్తరక్షకుడూ, శత్రుసంహారకుడూ అయిన దిలీపమహారాజు తన ఏమరుపాటుకు అవమానపడ్డాడు. వెనువెంటనే అపరాధియైన సింహాన్ని చంపటానికై బాణం తీసికోవాలని అమ్ములపొదిలోకి కుడిచేయి పోనిచ్చాడు. గోటికాంతులు ప్రసరించిన కంకపత్రాలు కల బాణపుపిడి కంటుకొని చేయి చిత్రంలో గీసిన బొమ్మలాగా కదలకుండా అలాగే స్తంభించిపోయింది. చెయ్యి కొయ్యబారిపోవటంతో రాజుకు కోపం ఇనుమడించింది. అయినా అతడు ఏమీ చెయ్యలేని అసహాయ స్థితిలో ఉండిపోయాడు. మంత్రౌషధాలతో కట్టుబడ్డ పాములాగా, ప్రక్కనే వున్న అపరాధిని అంటజాలని తన తేజస్సులతో తనలో తానే ఆ నరపాలుడు కుమిలిపోయాడు.

ఆర్యజనపక్షపాతీ, మనువంశకేతనుడూ, సింహపరాక్రముడూ, తన బాహువు అలా స్తంభించిపోయినందుకు ఆశ్చర్యపడుతున్నవాడూ అయిన ఆ భూపాలుణ్ణి మరింత ఆశ్చర్యపరుస్తూ గోవును నిగ్రహించిన సింహం మనుష్యవాక్కులతో ఇలా అన్నది.

"రాజా! ఎందుకు వృథాగా శ్రమపడతావు? నీ అస్త్రం నాపైన ప్రయోగించిన వ్యర్థమే అవుతుంది. గాలి వేగం చెట్లను పెళ్ళగించగలదు గాని కొండను కదిలించగలుగుతుందా ? ఇంతకూ నన్ను ఎవరనుకున్నావు ? నేను శివుని కింకరుణ్ణి, నికుంభుడితో సమానుణ్ణి. నా పేరు కుంభోదరుడు. వెండికొండవంటి వృషభవాహనం అధిష్టించేటప్పుడు పరమేశ్వరుడు నామూపుమీదనే కాలూని నన్ను పవిత్రుణ్ణి చేస్తుంటాడు. ఇదిగో, ఈ ఎదురుగా ఉండే దేవదారు వృక్షాన్ని చూడు, దీన్ని శంకరుడు పుత్రునిలా పెంచుకొన్నాడు. పార్వతీదేవి స్తన్యమిచ్చి కుమారస్వామిని పెంచినట్లే బంగారు కుండలతో నీళ్లుపోసి ఈ చెట్టునుకూడా పెంచింది.

ఒకసారి ఒక అడవియేనుగు కపోలంమీది దురద తీర్చుకోవటానికై ఈ చెట్టును ఒరసికొన్నది. అందువల్ల దీని పట్ట కాస్త వూడిపోయింది. అదిచూచి పార్వతి రక్కసుల ఆయుధాలతో దెబ్బతిన్న కుమారుణ్ణి చూచి

ఏడ్చినట్లు ఏడ్చింది. ఆనాటి నుండి అడవి ఏనుగులకు భయం కల్గడానికై శూలపాణి నన్ను సింహరూపంతో ఈ కొండగుహలో కాపలా వుంచాడు. చెంతకు వచ్చిన జంతువులనే నాకు ఆహారంగా ఏర్పాటు చేశాడు. సరిగ్గా నా భోజనవేళకే శివుని ప్రేరణతో ఈ యావు ఇక్కడికి వచ్చింది. రాహువునకు చంద్రుని అమృతంలాగా ఆకలిగొన్న నాకు గోరూపంలోవున్న రక్తభోజనం తృప్తికల్గిస్తుంది. ఈ విషయంలో సిగ్గుపడకుండా నీదారిన నీవు తిరిగిపో, గురువుపట్ల నీవు శిష్యభక్తిని లెస్సగా నిరూపించుకొన్నావు. శస్త్రబలంతో కాపాడటానికి వీలుగాని దానిని కాపాడలేక పోవడంవల్ల శస్త్రధారుల కీర్తికి ఎంతమాత్రం లోపం లేదు''.

మృగరాజు పల్కిన ప్రౌఢమైన ఈ మాటలు దిలీప మహారాజు విన్నాడు. తన అస్త్రబలం కుంటువడటానికి శివుని ప్రభావం కారణమని గ్రహించాడు. దానితో అతనిలోని అవమానభావం సడలిపోయింది. రాజుకు తన బాణ ప్రయోగ ప్రయత్నం విఫలం కావడం అదే మొదటిసారి. పూర్వం వజ్రాయుధ ప్రయోగానికి పూనుకొని ముక్కంటి కంటిచూపుతో స్తంభించిపోయిన ఇంద్రునిలా ఉన్నవాడై అతడు సింహంతో ఇలా బదులు చెప్పాడు.

''మృగరాజా ! ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో వున్న నేను ఇప్పుడు ఏమి చెప్పినా అది హాస్యాస్పదమే. అయినా నీకు జీవుల మనోభావాలు తెలుసు కాబట్టి నీతో నా అభిప్రాయం చెబుతాను. సకల చరాచర ప్రాణికోటి సృష్టిస్థితిలయాలకు కర్త అయిన ఆ పరమేశ్వరుడు నాకు పూజ్యుడే. అయినా నాగురువుగారికి అగ్నిహోత్ర సాధనమైన గోవు నా ముందే నశిస్తుండగా చూస్తూ ఊరకుండడం నాకు ఎంతమాత్రం తగదు. నీవు నా శరీరాన్ని ఆహారంగా స్వీకరించి నీ ఆకలి తీర్చుకో. సాయంకాలం కాగానే దీని లేగదూడ అంగలారుస్తూ ఉంటుంది. అంతేకాక ఇది వసిష్ఠ మహర్షి ధేనువు, కాబట్టి దయచేసి దీనిని వదిలిపెట్టు''.

అది విని సింహరూపుడైన శివసేవకుడు దంతకాంతులతో కొండ గుహలలోని చీకట్లు పటాపంచలయ్యేటట్టుగా ఇంచుక నవ్వి రాజుతో మరలా ఇలా అన్నాడు.

''మహారాజా! ఈ లోకంలో నీ దొరతనం తిరుగులేనిది. వయస్సు క్రొంగ్రొత్తది. శరీరం ఎంతో అందమైనది. ఇంచుక ఫలం ఆశించి ఇదంతా వదలుకోవాలనుకొంటున్నావు. ప్రజానాథా! నీకు జీవులమీద అంత దయ ఉంటే ఇది ఆలోచించుకో. నీ శరీరాన్ని నాకర్పిస్తే ఈ ఆవు ఒక్కటే క్షేమంగా ఉంటుంది. కాని నీవు బ్రతికి ఉంటే ఎందరో ప్రజలను తండ్రిలా కష్టాలనుండి కాపాడగలవు. ఒకవేళ నీ గురువు తనకున్న ఒకే ఒక్క గోవును పోగొట్టావని నిప్పులా మండిపడి శపిస్తాడని భయపడుతున్నావేమో! అలా భయపడవద్దు. దీనికి బదులు కోట్ల కొలది కుండపొదుగు గోవులను సమర్పించి ఆయన కోపం తొలగించవచ్చు. కాబట్టి నా మాట విను. కల్యాణ పరంపరను అనుభవించే బలిష్ఠమైన నీ శరీరాన్ని కాపాడుకో. ఈ ఆవును ఉపేక్షిస్తే స్వర్గానికి దూరమైపోతానేమో అనే చింతకూడా నీకు వద్దు. సకల సంపదలతో కూడిన నీ రాజ్యం సామాన్యమైనది కాదుసుమా! అది నేలపై నెలకొన్న స్వర్గమే''.

ఇలా చెప్పి సింహం మౌనం వహించింది. గుహనుండి వెలువడిన దానిమాటల ప్రతిధ్వని హిమవంతుడుగూడా ప్రేమతో దిలీపునికి మళ్ళీ అదే ఉపదేశం చేశాడా అన్నట్లు వినిపించింది. రాజు శివానుచరుని మాటలు విని భయపడిన కండ్లతో తన్ను

చూస్తున్న గోవుపై చాలా కనికరం చూపుతూ మళ్లీ సింహంతో ఇలా అన్నాడు.

"మృగరాజా! క్షతమునుండి (నాశము నుండి) రక్షించేవాడు అన్న వ్యుత్పత్తిని బట్టి రాజులకు శ్రేష్ఠమైన క్షత్రనామం ప్రసిద్ధమయింది. ఆపేరుకు తగిన విధంగా నడచుకోలేనివానికి రాజ్యమెందుకు ? లోక దూషణతో మలినమైపోయిన ప్రాణాలవల్ల ప్రయోజన మేమున్నది ? ఈ గోవుకు బదులు వేవే పాడి ఆవుల నిచ్చి మహర్షిని సమాధానపెట్టడం ఎలా సాధ్యం ? ఇది కామధేనువుకంటే తక్కువయింది కాదుసుమా! నీవు దీన్ని కొట్టగలిగావంటే దానికి కారణం శివుని ప్రభావమే గాని నీ శక్తిగాదు. అందువల్ల నా శరీరాన్ని మూల్యంగా అర్పించి నీ బారి నుండి గోవును రక్షించడం యుక్తమే. అలా చేస్తే నీభుక్తికీ లోటుండదు. మహర్షి హోమకార్యమూ లోపం లేకుండా నెరవేరుతుంది.

నీవూ ఒక ప్రభువు కొలువులో ఉండేవాడివే కాబట్టి నీకీ విషయం తెలియనిదికాదు. ఈ దేవదారువృక్షాన్ని నీవు ఎంతో ప్రయత్నంతో కాపాడుతున్నావు కదా! కాపాడవలసిన దాన్ని నశింపజేసి తనకు ఏమాత్రం దెబ్బలేకుండా ప్రభువు ముందర సేవకుడు ఎలా నిలబడగలడు ? కాబట్టి ప్రాణాలైనా ఇచ్చి మా గురువుగారి ధేనువును కాపాడడమే నా ధర్మం. నన్ను చంపగూడదని నీవు భావిస్తున్నావా ? ఐతే ఈ భౌతిక కాయాన్ని భోజనంగా స్వీకరించి నాకీర్తికాయంపై దయజూపి కాపాడు. ఈ భౌతిక శరీరాలు ఎలాగూ నశించేవే కాబట్టి మాబోటివారికి వీటిపై అపేక్ష ఉండదు. పరస్పరం మాటలాడుకోవడమే స్నేహానికి కారణమంటారు. మనకిద్దరికీ ఈ అడవిలో స్నేహం కుదిరింది. ఓ శివసేవకుడా! మిత్రుడనైన నా కోరికను భంగంపరచడం నీకు తగదు".

దిలీపుని మాటలకు సమ్మతించి సింహం నందినీ ధేనువును వదిలిపెట్టింది. వెంటనే అంతవరకూ స్తంభించివున్న భూపాలుని భుజం మళ్లీ అతనికి స్వాధీనమయింది. అతడు ఆయుధాలు వదలి తన శరీరాన్ని మాంసపు ముద్దలాగా సింహాని కర్పించాడు. అధోముఖుడై పడివున్న తనపై మహోగ్రంగా సింహం దూకుతుందని ఎదురు చూస్తూ ఉన్న నరపాలుని మీద విద్యాధరులు పూలవాన కురిపించారు.

అపుడు రాజుకు "బాబూ! లే!" అన్న అమృత ప్రాయమైన వాక్కు వినిపించింది. అతడు లేచి చూచేసరికి ఎదుట తల్లిలాగా పాలు చేపుతూ వున్న నందినీధేనువు కనిపించిందే కాని సింహం కనిపించలేదు. అదృశ్యం చూచి అతడు ఆశ్చర్యపడ్డాడు. అప్పుడు గోవు ఇలా చెప్పింది.

"ఓ సద్గుణశాలీ! నిన్ను పరీక్షించడానికే నేను ఈ మాయ కల్పించాను. ఋషి ప్రభావం వల్ల యముడు గూడా నాజోలికి రాలేడు. ఇక ఇతర క్రూరమృగాల మాట చెప్పాలా ? వత్సా! నీ గురుభక్తికీ, నాపై నీవు చూపిన దయకూ నేనెంతో సంతోషించాను. వరం కోరుకో, ఇస్తాను. నన్ను పాలుమాత్రం పిదికే ఆవుగా భావించవద్దు. అనుగ్రహం కల్గితే కోరిన కోర్కెలను అన్నింటినీ ఇస్తానని తెలుసుకో!"

పిమ్మట మహాదాతగానూ, మహావీరుడుగానూ ప్రసిద్ధి కెక్కిన దిలీప మహారాజు భక్తితో చేతులు జోడించుకొని శాశ్వతకీర్తి గల్గి వంశం నిల్పే కొడుకు సుదక్షిణకు కలిగేటట్లు అనుగ్రహించమని ధేనువును వేడుకున్నాడు. సంతానార్థి అయిన అతడు కోరిన వరం ప్రసాదించి ఆ గోవు "వత్సా! నా పాలను ఆకుదొప్పలో పిదికిత్రాగు" అని అతణ్ణి ఆదేశించింది.

''అమ్మా! దూడ త్రాగిన పిమ్మట హోమానికి వినియోగపడి మిగిలిన పాలు నా ఏలుబడిలోనున్న భూమండలి నుండి ఆరవ భాగమునువలె గురువుగారి సెలవుతో స్వీకరించ గోరుతున్నాను'' అని రాజు విన్నవించుకొన్నాడు. ఆ విన్నపానికి నందిని చాలా సంతసించింది. అది రాజుతోగూడ హిమాద్రిగుహనుండి బయలుదేరి అనాయాసంగా తిరిగి ఆశ్రమం చేరుకొన్నది.

ప్రహర్ష చిహ్నంతో ముందుగానే ఊహించబడిన నందినీ ధేనువు యొక్క అనుగ్రహవృత్తాంతమును ప్రసన్న వదనుడైన భూపాలుడు పునరుక్తం గావించాడాఅన్నట్లు గురువునకు ముందు విన్నవించి పిదప సుదక్షిణాదేవికి తెలియజేశాడు. తర్వాత సాధువత్సలుడూ, పవిత్ర చిత్తుడూ అయిన ఆ నరపాలుడు వసిష్ఠమునీంద్రుని అనుమతితో దూడకూ, హోమానికీ ఉపయోగపడి మిగిలిన నందినీ క్షీరాన్ని రూపుదాల్చిన తన తెల్లని కీర్తిని త్రాగుతున్నాడా అన్నట్లు మిక్కిలి ఆశతో త్రాగాడు.

ఆ మరునాటి ఉదయం గోసేవా వ్రతపారణ పూర్తి కాగానే జితేంద్రియుడైన వసిష్ఠ మహర్షి రాజదంపతులను ప్రయాణోచిత రీతిగా ఆశీర్వదించి రాజధానికి సాగనంపాడు. భూపాలుడు హవిస్సుతో వెలుగుతున్న అగ్నినీ, వసిష్ఠుణ్ణీ, అరుంధతీదేవినీ, దూడతో సహా నందినీ ధేనువునూ వరుసగా ప్రదక్షిణీకరించి మంగళాచరణంతో అతిశయించిన ప్రభావం కలవాడై బయలుదేరాడు. రథం చెవుల కింపుగా ధ్వనిస్తూ ఉండగా ధర్మపత్నితో గూడి సహనశీలుడైన ఆ రాజు ఒడుదొడుకులు లేని త్రోవలో సంపూర్ణమనోరథుడై హాయిగా ప్రయాణం కొనసాగించాడు.

చిరకాలం ప్రవాసంలో ఉండి వ్రతానుష్ఠానం వల్ల కృశించిన శరీరంతో మళ్ళీ నగరానికి తిరిగి వస్తున్న రాజును ప్రజలు అప్పుడే ఉదయించిన విదియనాటి చంద్రునిలా తనివిదీరని చూపులతో చూచారు. ఇంద్రునిలా ఐశ్వర్యసంపన్నుడైన అతణ్ణి వాళ్ళు వేనోళ్ళకొనియాడారు. ఎగురుతున్న జెండాలతో కళకళలాడే నగరం ప్రవేశించి దిలీపమహారాజు ఆదిశేషునిలా బలసంపన్నమైన తన భుజంపై మళ్ళీ రాజ్యభారాన్ని వహించాడు.

తర్వాత ఆకసం అత్రిమహర్షినేత్ర సంభూతమైన జ్యోతినీ, (చంద్రుణ్ణీ), గంగానది అగ్ని విసర్జించిన ఈశ్వరతేజాన్నీ (కుమారస్వామినీ) ధరించిన విధంగా సుదక్షిణాదేవి దిలీపుని వంశానికి ఐశ్వర్యం పెంపొందేటట్లుగా, అష్టదిక్పాలకుల అంశాలతో కూడిన గర్భాన్ని ధరించింది.

(సశేషం)

---

19వ పేజి తరువాయి ......

కౌటిల్యుడు, ఎప్పుడు యుద్ధం చేయాలి, ఎప్పుడు చేయకూడదు

అనే నిర్ణయానికి '8' కారణాలు తెలుపుతాడు.

అవి :

1. బలం. (ఈ బలం మూడు రకాలు (అ) బుద్ధిబలం, (ఆ) సైన్యబలం, (ఇ) ఆత్మబలం.)

2. ప్రదేశము, 3. కాలము,

4. సరైన బలగాలు,

5. అంతర్గత తిరుగుబాటు,

6. ఆశయం, 7 లాభ నష్టాలు,

8. నమ్మకద్రోహం వంటివన్నీ రాజు తన నమ్మకమైన మంత్రులతో చర్చించి, నిర్ణయం తీసుకోవాలి. నిర్ణయం తీసుకున్న తరువాత వెంటనే దానిని అమలు చేయాలి. తనకంటే బలవంతునితో యుద్ధం చేయకూడదు. ఇలా రాజనీతి గురించి కౌటిల్యుడు తన అర్థశాస్త్ర గ్రంథంలో చాలా చక్కగా వివరించాడు.

# మాఘమాసం - మహాపుణ్య ఫలప్రదం

నెమ్మాని సీతారామమూర్తి

మాఘంమాసం స్నానానికి ప్రసిద్ధి ఇహలోక కామ్యసిద్ధితోపాటు పరలోక పుణ్యసిద్ధి కూడా ఏకకాలంలో లభిస్తుంది. ప్రతి రోజు సూర్యోదయం కాబోతున్న సమయంలో మాఘంస్నానం చేస్తే మహాపాతాకాలు నశిస్తాయిని శాస్త్రాలు చెప్తున్నాయి.

**శ్లో॥ మాఘమాసే రటంత్యాపః కించిదభ్యుదితే రవౌ**
**బ్రహ్మఘ్నం వా సుశాపం వా కంపతంతం పునేమహే॥**

బ్రహ్మచారి గృహోస్థోవా వాగ ప్రస్థోద బిక్షోకః

అని ప్రయాణవచనం. నాలుగో ఆశ్రమాలవారూ ఈ స్నానం చేయవచ్చు.

**శ్లో॥ తప్తేన వారిణాస్నానం యద్గృహే క్రియతే సరైః**
**షడబ్దం ఫలదేం తద్ధి మకరస్థే దివాకరే॥**

భావము :

సూర్యుణి మకరంలో ఉండే సమయంలో (మాఘ మాసంలో) సూర్యోదయానికి మునుపు, వేడి నీటిలోనైనా, ఇంట్లో స్నానం చేసినా ఆరు సంవత్సరాల అఘమర్ధణ స్నాన ఫలం లభిస్తుంది. బావి నీటి స్నానం 12 ఏళ్ళు, తటాక స్నానం 24 ఏళ్ళు, నది స్నానం 48 ఏళ్ళు, మహస్నానం 600 ఏళ్ళు, మహానది సంగమ 2400 ఏళ్ళు, గంగాస్నానం 6000 సంవత్సరాలు, అఘమర్ధణ స్నాన ఫలితాలు ఇస్తాయి.

ప్రతి రోజూ ఇంట్లో స్నానం చేసేటప్పుడు దివ్య తీర్థాలతో స్మరించి స్నానం చేసినట్లయితే పుణ్య ఫలితం పొందుతారు.

**శ్లో॥ దుఃఖ దారిద్ర్య నాశాయ శ్రీవిష్ణోస్తోషణాయచ**
**ప్రాతః స్నానం కరోమ్యద్య మాఘే పాప వినాశనం**
**మకరస్థే రవే మాఘే గోవిందాచ్యుత మాధవ**
**స్నానే నానే నయే దేవయదోక్త ఫలదోభవ॥**

**సంవత్సర సంధ్య**

మనకు ప్రతి రోజూ వచ్చే సంధ్యా సమయం ఎంత పవిత్రమైనదో సంవత్సరంలో వచ్చే మాఘమాసం అంతకంటే ముఖ్యమైనది. సంవత్సరం మొత్తంలో దైవశక్తులు, ఉపాసనా దేవతలు, గురుశక్తులు అన్నీ జాగృతమయ్యే సమయం ఇది. ఒక్క మాఘ మాసంలో చేసే ఉపాసనే మిగిలిన సంవత్సరమొత్తం చేసే ఉపాసనా ఫలితం ఇస్తుందని ధర్మశాస్త్ర గ్రంధాలు పేర్కొంటున్నాయి.

ఈ మాసంలో వచ్చే చవితి, సప్తమి, పూర్ణిమ, ఏకాదశి, మాస శివరాత్రి అన్నీ మహా ఫలితాలు ఇస్తాయి. సూర్య, విష్ణు, శివార్చనలు మరింత ముక్తి హేతికం.

**ఢుండి గణపతికి**

మాఘ శుక్ల చతుర్థి నుండి గణపతికి ప్రీతికరం. ఈ రోజు పగలు ఉపవాసం ఉండి రాత్రి ప్రారంభంలో గణపతిని పూజించాలి. బెల్లంతో చేసిన లడ్డూలను స్వామికి నివేదించాలి. దీని వల్ల పూజించిన వారికి సర్వసంపదలు సిద్ధిస్తాయి.

**శివునికి మల్లెలు**

సాధారణంగా శివునికి బిల్వార్చన అంటే ఇష్టం. కానీ జగదాంబిక కోరిక మేరకు మాఘశుక్ల చతుర్థి రోజున మల్లెలతో పూజించే వారికి 'మహదైశ్వర్యం' ప్రసాదిస్తానని వరమిస్తాడు.

**శ్రీ పంచమి**

మాఘం శుద్ధ పంచమిని 'శ్రీ పంచమిగా' సంబోధిస్తారు. ఉత్తర భారతదేశం, ఒరిసా, బెంగాల్‌లలో ఈ పంచమిని విశేషంగా నిర్వహిస్తారు. అలాగే దేవీభాగవతం, బ్రహ్మవైవర్త పురాణాలు శ్రీపంచమి ఫలితాలు విశేషంగా చెప్పారు.

ఈ రోజున బ్రహ్మ ముహూర్తంలో నిదురలేచి, నిత్యనైమిత్తిక కార్యక్రమాల అవనంతరం శుచిగా తలస్నానం చేయాలి. అనంతరం ఎవరైతే సరస్వతి దేవిని ఆరాధిస్తారో వారికి అనంతమైన విద్యాసంపద లభిస్తుందని అమ్మవారే స్వయంగా చెప్పారు. ప్రతిమ, పుస్తకం, పటం, విగ్రహాల రూపాలలో వాగ్దేవిని ఆరాధించాలి. క్షీరాన్నం, పళ్ళు, కొబ్బరి, ఇతర పిండి వంటలుని వేదించాలి.

**రథ సప్తమి**

**శ్లో॥ సూర్యగ్రహణ తుల్యా సా శుక్లా మాఘస్య సప్తమీ**
**అరుణోదయ వేళాయాం స్నానం తత్రమమాలమ్॥**

రథసప్తమిని నిర్ణయామృతము, వ్రతచూడమణి , మదన రత్నకం మొదలైన ప్రామాణిక గ్రంథాలు సూర్యగ్రహణంతో సమానంగా పోల్చాయి. ఎవరైతే రథ సప్తమి రోజు శాస్త్రాలు బోధించిన రీతిలో స్నానాలు ఆచరిస్తారో జన్మ జన్మల సర్వపాపం నుంచి విముక్తమవుతారు.

**శ్లో॥ మాఘేమాసి సితే పక్షే సప్తమీ కోటి పుణ్యదా॥**
**కుర్యాత్ స్నానార్ఘ్య దానాభ్యా మాయురారోగ్య సంపదః**

''షష్టినాడు రాత్రి ఉపవాసముండి సప్తమి సూర్యోదయ సమయంలో స్నానం ఆచరిస్తే వారికి మంచిది.

**శ్లో॥ జననే త్వంహి లోకానం సప్తమీ సప్తసప్తికే**
**సప్తవ్యాహృతకే దేవే నమస్తే సూర్య మాతృకే॥**

''సప్తాశ్వములు గల ఓ సప్తమీ'' నీవున కల భూతములకు, లోకములకు జననివి.సూర్యనికి తల్లివైన నీకు నమస్కారము.

**జిల్లేడు పత్రాలు**

జిల్లేడు పత్రాలు సూర్యునితో సమానంగా ఫలితాలు ఇస్తాయి. స్నాన సమయాల్లో శిరస్సుపై ఇరు భుజాల మీద జిల్లేడు ఆకులు ఉంచుకొని స్నానం చేస్తేనే రథసప్తమి ఫలితం పొందుతాము.

**భీష్మ ఏకాదశి - విష్ణు సహస్రనామం**

సాధారణంగా హిందూ దేవతల మంత్రాలు, స్తోత్రాలును దేవతలు, ఋషులు, ప్రజలకు అందిచారు. కానీ భక్తుడే భగవంతుని గురించి మొట్ట మొదటిసారిగా లోకానికి అందించిన మహత్తరమైన స్తోత్రం విష్ణు సహస్రనామం. ఇక్కడ భగవంతుడు, భక్తుడు ఒకటిగా మారతాడు. శ్రీకృష్ణుడు తన జన్మ నక్షత్రమైన రోహిణి ని భీష్ముని అంత్య నక్షత్రంగా చేయడంలో గల కారణం ఇదే. తనను ఆరాధించిన వారు తనతో సమానులే అన్న సంగతిని భీష్మ ఏకాదశి స్పష్టం చేస్తుంది.

అందుకే ఆయన గళం నుంచి ఆవిర్భవించిన విల్లు సహస్రనామం నిత్య పారాయణంగా మారింది.

**మహాశివరాత్రి**

మాఘ కృష్ణచతుర్ధశి మహదేవుడు అగ్ని స్థంభంగా దర్శనమిచ్చిన పరమ పవిత్రమైన రోజు. ఈ రోజు అర్ధరాత్రి కాలంలో మహాలింగోద్భవ అభిషేకాలు, లక్ష బిల్వార్చనలు, తిమ్మిపూల పూజలు విశేష ఫలితాలను అందిస్తాయి. అగ్ని లింగాకారంలో ఉన్న పరమేశ్వరుడిని అర్ధరాత్రి సమయంలోనే బ్రహ్మవిష్ణులు ఆరాధించి జ్ఞానం పొందారు. వారిలో ఉన్న అహంకారం తొలగి జ్ఞానం ఆవిర్భవించిన సందర్భంగా మహాశివరాత్రి సకల భువనాలకి జ్ఞానరాత్రిగా కూడా స్కంద పురాణం పేర్కొంటోంది.

# సనాతన ధర్మము - దాని విశిష్టత

...... స్వామి ముకుందానంద సరస్వతి, ఋషికేష్: 09410990829

## ఇంద్రియ నిగ్రహము

మానవుని యొక్క పురోభివృద్ధికి ఇంద్రియ నిగ్రహము అత్యవసరము. ముఖ్యముగా సాధకుల విషయములో ఇది అనివార్యమైనది. ఇంద్రియ నిగ్రహములేని వ్యక్తి ఏ కార్యమునైనను సాధింపజాలడు. ఇంద్రియ నిగ్రహము లేని మానవుడు వ్యక్తిత్వమును కోల్పోవును. ఇంద్రియ నిగ్రహము గలిగిన వ్యక్తియే పురుషార్థములను సాధించగలడు.

పురుషార్థములను సాధింపదలచినవానికి ఇంద్రియములు పరమశత్రువులని కృష్ణ పరమాత్మ భగవద్గీతలో పేర్కొన్నాడు.

**శ్లో॥ ఇంద్రియ స్యేంద్రియస్యార్థే రాగద్వేషౌ వ్యవస్థితౌ ।**
**తయోర్నవశమాగచ్ఛేత్తౌ హ్యస్య పరిపంథినౌ॥ (3-34)**

'ప్రతి ఇంద్రియమునకు అనుకూల విషయములయందు రాగము, ప్రతికూల విషయములయందు ద్వేషము విశేషముగ నుండును. కావున మానవుడు ఇంద్రియములకు వశము కాగూడదు. పురుషార్థములను సాధింపదలచిన వానికి ఇవి పరమశత్రువులు'.

మానవుని యొక్క పతనమునకు ఒక్క ఇంద్రియమే చాలును. ఏ ఒక్క ఇంద్రియమునకున్నూ మానవుడు లొంగిన యెడల, ఆ ఒక్క ఇంద్రియమే మానవుని సర్వనాశనము చేయగలదు. ఇదే సత్యమును కృష్ణపరమాత్మ భగవద్గీతలో చక్కగా వర్ణించినాడు :

**శ్లో॥ ఇంద్రియాణాం హి చరతాం యన్మనోఽనువిధీయతే।**
**తదస్య హరతి ప్రజ్ఞాం వాయుర్నావమివాంభ సి॥ (2-67)**

'విషయములందు సంచరించు ఇంద్రియములలో ఏ ఒక్క ఇంద్రియమునైననూ మనస్సు అనుసరించినచో ఆ ఇంద్రియము వాయువు, నీటిలో నావికుడు లేని నావను వలె జితేంద్రియుడు కానివాని బుద్ధిని హరించును'.

ఇంద్రియములు అతి బలవత్తరములైనవి. ప్రపంచములో మానవుడు ఎంత జాగ్రత్తగా మెలగుచున్నప్పటికి, ఇంద్రియములు బలవంతముగ అతని యొక్క మనస్సును విషయములలోనికి ఆకర్షింపజూచును. కావున మనిషి జాగరూకుడై యుండవలెను.

ఇదే విషయమును కృష్ణ పరమాత్మ భగవద్గీతలో ఇట్లు చెప్పినాడు.

**శ్లో॥ యతతో హ్యపి కౌంతేయ పురుషస్య విపశ్చితః।**
**ఇంద్రియాణి ప్రమాథీని హరంతి ప్రసభం మనః ॥ (భగ. 2-60)**

'అర్జునా! ప్రయత్నశీలుడును, వివేకియునగు పురుషుని యొక్క మనస్సును సహితము వినాశకరములగు ఇంద్రియములు బలవంతముగ విషయములలోనికి లాగగలవు (ఆకర్షింపగలవు)'.

ఈ ఆకర్షణ నుండి తప్పించుకొనుటకు మార్గమును కృష్ణ పరమాత్మ ఉపమాన పూర్వకముగ చక్కగా బోధించినాడు:

**శ్లో॥ యదా సంహరతే చాయం కూర్మోఽంగా నీవ సర్వశః।**
**ఇంద్రియాణీంద్రియార్థేభ్యః తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ (భగ. 2-58)**

'తాబేలు తన అవయవములను లోనికి లాగుకొనునట్లు, ఎవ్వడు శబ్దాది విషయములనుండి తన ఇంద్రియములను ఉపసంహరించుకొనునో వాని ప్రజ్ఞ స్థిరముగ నుండును'.

ఇంద్రియ - విషయములను ఎంత అనుభవించినప్పటికిని, మానవునికి తృప్తి కలగదు. అనుభవించు కొలది ఇంకను అనుభవించవలయుననెడి కోరిక వృద్ధి పొందుచునే యుండును. దీనినే మనుస్మృతి సోదాహరణ పూర్వకముగా వివరించుచున్నది.

**శ్లో॥ న జాతు కామః కామానాముప భోగేన శామ్యతి।**
**హవిషా కృష్ణవర్త్మేవ భూయ ఏవాభివర్ధతే ॥ (మను. ॥ -94)**

'అగ్నిలో హవిస్సును పోసినపుడు అగ్ని ఇంకను వృద్ధిపొందినట్లు, ఇంద్రియ - విషయముల ననుభవించుకొలది విషయ-వాంఛ వృద్ధియగునే కాని తగ్గదు'.

ఇంద్రియములనెట్లు వశపరచుకొనవలయునో మనుస్మృతి బోధించుచున్నది.

**శ్లో॥ న తథైతాని శక్యన్తే సంనియన్తుమసేవయా।**
**విషయేషు ప్రజుష్టాని యథా జ్ఞానేన నిత్యశః ॥ (మను.॥ - 96)**

'విషయములలో విహరించు ఇంద్రియములు నిరోధించుట చేత వశపరచుకొనబడవు. వాటిని జ్ఞానము (వివేకము) చేత వశపరచుకొనవలయును'.

పంచేంద్రియములలో ఏ ఒక్క ఇంద్రియమైననూ మన మనస్సును వశపరచుకొనిన యెడల, ఆ ఒక్క ఇంద్రియమే వినాశకారకమగునని కృష్ణపరమాత్మ భగవద్గీతలో నుడివినట్లుగానే, మనుస్మృతి గూడ ఈ విషయమును చక్కని ఉపమానముతో వివరించినది :

**శ్లో॥ ఇంద్రియాణాం తు సర్వేషాం యద్యేకం క్షరతీంద్రియమ్ ।**
**తేనాస్య క్షరతి ప్రజ్ఞా దృతేః పాదాదివోదకమ్ ॥ (మను.॥ -99)**

'ఘటమునకు ఏ ఒక్క చిన్నరంధ్రమున్నప్పటికి ఘటములోని నీటిని ఖాళీ చేయునట్లు పంచేంద్రియములలో ఏ ఒక్క ఇంద్రియమైనను విషయాసక్తమై యుండిన యెడల ఆ ఒక్క ఇంద్రియమే వివేకమును నశింపచేసి, పతన కారణమగును'.

**శ్లో॥ శ్రుత్వా స్పృష్ట్వా చ దృష్ట్వా చ భుక్త్వా ఘ్రాత్వా చ యో నరః।**
**న హృష్యతి గ్లాయతివా స విజ్ఞేయో జితేంద్రియః ॥ (మను. ॥-98)**

'ఏ మానవుడైతే ఇంద్రియ - విషయములలో మెలగుచు గూడ వాటిచేత ప్రభావితుడు గాక ఆహ్లాదమును గానీ, దుఃఖమునుగాని పొందక యుండునో, అతడు 'జితేంద్రియుడు' గా తెలియబడును.

తరువాత, మానవుడు పురుషార్థములను ఎలా సాధించవలయునో చక్కగా బోధించుచున్నది :

**శ్లో॥ వశే కృత్వేంద్రియగ్రామం సంయమ్య చ మనస్తథా।**
**సర్వాన్ సంసాధయే దర్థా న క్షిణ్వన్యోగతస్తనుమ్॥ (మను. ॥-100)**

'యోగముచేత దేహమును కృశింపచేయక, ఇంద్రియములను వశపరచుకొని, మనస్సును సంయమించి మానవుడు పురుషార్థములను సాధించవలెను'.

ఇంద్రియములను ఎట్లు వశపరచుకొనవలయునో మహోపనిషత్తు చక్కని ఉపమానము ద్వారా బోధించుచున్నది:

**మం॥ ఉత్థితానుత్థితానేతా నిన్ద్రియాదీన్పునః పునః।**
**హన్యా ద్వివేకదండేన వజ్రేణేవ హరిర్గిరీన్॥ (మహోపనిషత్)**

'పై పైకి లేచుచున్న ఇంద్రియ శత్రువులను వివేకమనుదండముతో, ఇంద్రుడు వజ్రాయుధముతో పర్వతపక్షములను నరికినట్లుగా, మాటిమాటికి కొట్టుచుండవలెను'.

ఇంద్రియములను జయించినవాడే సర్వమును జయించినవాడగునని యోగశిఖోపనిషత్తు

తరువాయి 34వ పేజిలో......

# యోగవాసిష్ఠ కథాలహరి

డా॥ ధారారామనాధశాస్త్రి, ఒంగోలు

## బ్రహ్మదేవునికి బాల బోధ

వసిష్ఠమునీంద్రుల వారు రామసన్నిధి ప్రవచనం కొనసాగిస్తూ ఇలా అన్నారు. చూడు రామయ్యా - ఇవ్వాళ వైక్లబ్యానికి గురియైనవే దానికి కారణం ఆలోచించావా ? సుఖదుఃఖాలకీ మోదఖేదాలకే ఇంకా ఇలాంటి ద్వంద్వాలకే కాక సమస్త సృష్టికీ ఆధారభూతమైనది మనస్సు. మనస్సంకల్పం చేతనే చరాచరము సృష్టించబడుతున్నది. ఇది వినడానికి అసంగతంగా తోచినా అంగీకరించక తప్పని సత్యము. రామచంద్రా శ్రద్ధగా ఆలకించు. ఓసారి ఏమైందంటే..

బ్రహ్మదేవుడు చరాచర సృష్టిని కావించి యుగాంత వేళ ముగిస్తాడు కదా. మళ్ళీ సృష్టి చేయాలని సంకల్పించడానికి ముందు ఒక కల్పాంత రాత్రి విశ్రాంతి తీసుకుంటున్నాడు. మనోమార్గంలో గగనాన్ని వీక్షిస్తున్నాడు. ఆశ్చర్యకరంగా ఆయనకి ఎన్నో బ్రహ్మాండ గోళాలు, గ్రహాంతర నక్షత్ర సముదాయము ప్రత్యక్షమైనాయి. అద్భుతభావం నుండి తెప్పరిల్లుకొని బ్రహ్మ తనకి కనిపించిన గోళాలలో ఒక సూర్యుని పిలిచి అడిగాడు. ఎవరు నీవు ? ఈ సృష్టి అంతా ఎలా జరిగింది ? ఆ సూర్యుడు పరమేష్టికి అంజలించి పరమేష్ఠీ, అవధరించండి. ఓసారి ఏమైందంటే...

జంబూద్వీపానికి ఒక మూలనున్న కైలాసగిరి జగత్ప్రసిద్ధము. మహర్షులకు నివాసయోగ్యము. తపస్సునకు అనుకూలము. ఆ పర్వత సానువులలో సువర్ణజట అను పేరుగల ప్రదేశము మరింత రమ్యము. అక్కడ కశ్యప వంశజుడైన ఇందువు అను పేరుగల బ్రాహ్మణోత్తముడు ఒక ఆశ్రమాన్ని నిర్మించుకొని అనుగుణ భార్యావంతుడై పవిత్ర జీవనం సాగిస్తున్నాడు. కొన్నాళ్ళకి ఆ దంపతులకు సూర్య సమతేజులు, అహంకార ప్రజ్ఞకి ఆకృతులలాంటివారు, కణకణమండే నిప్పుకణికలలాంటి తేజం కలవారు పదిమంది పుత్రులుద్భవించి, తండ్రిగారి మార్గంలోనే పవిత్ర జీవనులై పెరుగుతున్నారు. కొంతకాలానికి జననీ జనకులు కాలధర్మం చెందగా ఆ పదిమందిన్నీ కైలాస పర్వత శిఖరాగ్రానికి వెళ్ళి అక్కడ క్రమంగా మాతాపితృవియోగ సంజనిత దుఃఖాన్ని బాపుకొని, వారిలో వారు ఇలా చింతన చేసుకొన్నారు. అందులో పెద్దవాడన్నాడు, 'సోదరులారా! జననీ జనకులు గతించారు. మనం మనకాళ్ళమీద నిలబడి ఐశ్వర్యము పొంది, స్వయంకృషిచేత భాసించవలసియున్నది. అవునూ! అన్ని ఐశ్వర్యములలోకి ఏది ఎక్కువంటారు? మీ ఆలోచనలు చెప్పండి' అన్నాడు. అన్నదమ్ముల మధ్య ఏదీ మహదైశ్వర్యము అన్నది చర్చనీయం కాగా పలువురు పలు అభిప్రాయాలు వ్యక్తం చేసారు. సామాన్య మానవుడు ఐశ్వర్యవంతుడని ఒకడు, కాదు గ్రామధిపతి సంపద గొప్పదని ఇంకొకడు, సామంతుల ఐశ్వర్యమ్మొందర అది దిగదుడుపు అని మరొకడు ఆ మాటకి వస్తే ఆపైన ఇంద్రుని ఐశ్వర్యమని చర్చలు జరిగాయి. కొంతసేపు అయిన తరువాత ఇంద్రుని ఐశ్వర్యము కూడా శాశ్వతముకాదు ఎందుకంటే కల్పాంతంలో బ్రహ్మసృష్టిని ఉపసంహరించినప్పుడు ఆ ఐశ్వర్యము

కూడా నశిస్తుంది కదా! అనే అభిప్రాయం ఒకడు వ్యక్తం చేశాడు.

ఇప్పుడు అన్ని అభిప్రాయాలను క్రోడీకరించి, పరిష్కారం చేసి, జీవనమార్గం ఆదేశించవలసిన బాధ్యత జ్యేష్ఠుడు స్వీకరించాడు. మరి అతడే గదా చర్చకి శ్రీకారం చుట్టాడు. కాబట్టి, ఇలా భరత వాక్యము పలికాడు. 'సోదరులారా! మీ అందరి అభిప్రాయాలు వాస్తవములే కానీ ఏదీ పూర్తి సత్యం కాదు. ఐశ్వర్యాలన్నింటిలో కల్పాంతం వరకు నశించని బ్రహ్మత్వం ఉన్నదే అది అన్నిటికంటే గొప్పది. కాబట్టి బ్రహ్మత్వ సాధన మన కర్తవ్యం పదండి. తపస్సుచేత సాధ్యం కానిది ఏదీలేదు.' అని కర్తవ్యం బోధింపగా తమ్ముళ్ళు అడిగారు. 'అన్నా మన తపస్సుకి ఏమని సంకల్పించాలి. మన ధ్యేయం ఏమిటి ?' జ్యేష్ఠుడు ఇలా ప్రవచించాడు.

"పద్మాసనం మీద ఆసీనుడైనవాడు ప్రకాశమూర్తి అయిన బ్రహ్మను నేను. నేనే నా శక్తి చేత సమస్త బ్రహ్మాండాలను సృష్టిస్తాను, ఉపసంహరిస్తాను. నేనే బ్రహ్మను" తమ్ముళ్ళూ ఇదే మంత్రం - ఇదే చింత - ఇదే తపస్సు."

అన్న ఆదేశం మేరకు అందరు తపస్సు చేశారు. ఏళ్ళు పూళ్ళు గడిచాయి. వాళ్ళు బ్రహ్మత్వాన్ని సాధించుకొని మనఃసృష్టి చేశారు. అందులో ఒకానొక బ్రహ్మాండ గోళానికి నేనే సూర్యునిగా నియమింపబడ్డాను. పరమేష్టీ ఇది నా కథ - అని ఆ సూర్యుడు ముగించాడు.

సూర్య కథనం విన్న బ్రహ్మదేవుడు చలించాడు. మనస్సు సందేహాలతో తేనెతుట్టయినది. సూర్యుని ప్రశ్నించాడు. 'సూర్యభగవాన్! ఈ బ్రహ్మాండ గోళాలు ఇన్ని ఉన్నవి కదా! మళ్ళీ నేనెందుకు సృష్టి చేయాలి?'

సూర్యుడు అంటున్నాడు "అదేం మాట పరమేష్టి - మీకు తెలియనిదేమున్నది. ఎవరి మనస్సు వారిది. ఎవరి సృష్టి వారిది. మీ చిత్తాకాశంలో మీరు సృష్టి గావించండి. చిత్తాకాశం అనంతం. తొలివేల్పులైన తమకు చెప్పేంతవాణ్ణికాను. చిత్తాకాశం - చిదాకాశం - భూతాకాశం అన్న మూడు ఆకాశాలు చిదాకాశం చేతనే ప్రకాశిస్తాయి. అంచేత ఓ విరించీ మీరు ఒకటిగానీ, రెండుగానీ, అనేకములుగానీ సృష్టులు చేయండి!"

బ్రహ్మదేవుడు ఇంచుకసేపు మౌనం వహించి అన్ని విషయాలు సాకల్యంగా మనస్సుకు తెచ్చుకున్నవాడై "నిజమేనయ్యా' తరణీ! నీవు చెప్పినట్లు నాకు అభిమతమైన సృష్టిని నేను చేస్తూ నిత్యకర్మ పారయణుడనై వర్ధిల్లుతాను. ఔరా! ఎంత ఆశ్చర్యం! మనస్సుకెంత సామర్థ్యం! సామాన్య బ్రాహ్మణులే మనోభావన చేత బ్రహ్మపదాన్ని పొందారు.

అంటూ కథ ముగించిన శ్రీవసిష్ఠులు పిండితార్థం ప్రవచిస్తూ 'రామచంద్రా' విను. జగత్తులన్నింటినీ సృష్టించేది మనస్సు. మనస్సే పరమపురుషుడు. ఈ ప్రపంచంలో జరిగే కార్యకలాపం యావత్తూ మనస్సు చేతనే చేయబడుతున్నది. శరీరంచేతకాదు. కనుక ఓ రామా! నీవు పురుష ప్రయత్నం చేత నిత్యకర్మానుష్ఠానంచేత నిరంతర శ్రమణశీలుడవై మనస్సును మనస్సుచేతనే పట్టుకొని దానిని పవిత్ర మార్గములో పెట్టు. మీకు ఎలాంటి వైక్లబ్య విషాదాలు కలుగవు. సూర్యవంశజుడైన ఉత్తమ క్షత్రియునిగా ఒక మహాద్భుత ధర్మ చరిత్రను సృజించి సమస్తలోకాలకు, సమస్త కాలాలకు, సమస్త ప్రజలకు ఆదర్శప్రాయుడవుతావు - భవతు' అన్న సందేశమిచ్చారు.

గీతా సుధ

# భగవద్గీతకు భాసుర భాష్యం




డా॥ రాధశ్రీ, కర్నూలు, ఫోన్: 9494481210

(గత సంచిక తరువాయి)

**విస్తరేణాత్మనో యోగం విభూతిం చ జనార్ధన**
**భూయః కథయ తృప్తిర్హి శృణ్వతో నాస్తి మే మృతమ్ (10-18)**

సగుణుడయ్యూ నిర్గుణుడట, సాకేరి నిరాకారియునట, సర్వాంతర్యామి యంట, సకల మత నిలోగలదట, ఉదధియెట్లు ఘోషించునో, ఉర్వియేలకంపించునో, ఉదకవెట్లు జృంభించునో, అనలవెట్లు దహించునో, అనిలవెట్లు ఊగించునో, నింగియెట్లు నిలబడునో... తన సృష్టిని చేజేతుల తానే హరియించునెవడు.. ఏమిటి ఇదంతా... ఇదే నిజమైతే ఒక నేరం చేసినవాడు కూడ "న్యాయమూర్తి - నేనీ హత్య చేయలేదు... భగవంతుడే చేయించాడు, నేనీ దొంగతనం చేయిలేదు భగవంతుడే చేయించాడు" అని వాదించవచ్చు. అంతా అద్వైతమైనప్పుడు" ఆ జేబులోని వస్తువును తీసుకొని నా జేబులో పెట్టుకున్నాను. అంటే "అని దొంగకూడా వాదించవచ్చు. అందుకే ఈ జటిలమైన సమస్యకు శ్రీకృష్ణుడు చాలా యుక్తి యుక్తంగా సమాధానం ఇచ్చాడు.



మానవుడు కూడా ఒక గుంజకు కట్టబడిన ఆవులాంటివాడే. ఆ తాడు పరిధిలో ఆ ఆవు కుర్చోవచ్చు. పడుకోవచ్చు. నెమరు వేయవచ్చు. కానీ ఆ పరిధి దాటిరాలేదు. అంటే కొంత పరిధికి లోబడే మానవుడు స్వేచ్ఛాజీవి. ఆ పరిధి లోపల అతడు చేసే పనులకు అతడే బాధ్యుడు. కాబట్టి హత్య చేసో, దొంగతనం చేసో, మనోవికారం ప్రదర్శించో "అదంతా దేవుడే చేశాడు! చేయించాడు" అనడం మాత్రం కుదరదు. ప్రకృతి విలయం జరిగి ఊళ్లకు ఊళ్లు కొట్టుకొని పోవడమూ, అణుబాంబులు విసిరి హిరోషిమా - నాగసాకిలను ధ్వంసం చేయడమూ ఒకటి కాదు కదా! అది ప్రకృతి ప్రకోపం అయితే ఇది మానవుల ఉన్మాదం. సామ్రాజ్యవాద శక్తుల కండకావరం! మానవ విజ్ఞానాన్ని 'నిర్మూలన'కు వినియోగించడం అత్యంత హేయం! అది అమెరికా చేసినా, లాడెన్ చేసినా, తాలిబన్లు చేసినా, హిట్లర్ చేసినా, ముస్సోలినీ చేసినా, నాదిర్షా, గజనీ, ఘోరీ, తైమూర్, చంఘిజ్‌జేఖాన్, అలెగ్జాండరు... దురాశాపరులు, విజయాకాంక్షతో దాడులు జరిపిన దురాక్రమణదారులు... ఎవరు చేసినా అది వారి వారి తప్పిదమే! ఇవన్నీ భగవంతుడికి అంటగట్టి చేతులు దులుపుకోవడానికి వీల్లేదు. దివిసీమ ఉప్పెన, మోర్వీజల ప్రళయం, చార్‌ధాం ప్రకృతి భీభత్సం, కాశ్మీర్ ప్రకృతి ప్రకోపం మానవ పరిధికి అతీతమైనవి.

బాధితులను ఆదుకోవడానికి చర్యలు చేపట్టగలము. కాని ప్రకృతి వైపరీత్యాలను పూర్తిగా ఆపలేము. అయినా ఇందులో కూడా మానవ తప్పిదాలు లేవనికాదు. (భూమి నుండీ అడవులను స్వార్థం కోసం నరకుతున్నాము. ఖనిజాలను త్రవ్వితీసుకుంటున్నాము, రాళ్లను, రప్పలను లాగివేస్తున్నాము, గ్యాసును తీసి దాచుకుంటున్నాము. ఇదంతా మానవుడు ప్రకృతి మీద చేసిన దాడిగా భావిస్తే, ప్రకృతి ఎదురుదాడి చేయదా?) కాబట్టి ప్రకృతితో స్నేహపూర్వకంగా మానవుడు సహజీవనం చేయాలని ఈ భాష్యకారుడు (రాధశ్రీ) కోరుకుంటున్నాడు. ''ఇకో ఫ్రండ్లీ'' సంస్కృతిని ఆహ్వానిస్తున్నాడు.

ప్రతి అణువులతో, ప్రతి అణువణువులో, కణములో, రేణువులో భగవంతుడున్నాడని చెప్పినా అందులోని 'మంచి' మాత్రమే దేవునిగా గణించాలని కూడా గీతాకారుడు చెప్పి మనకు మరింత స్ఫుటంగా జ్ఞాన మార్గాన్ని చూపించాడు.

అర్జునుడు అంతగా ప్రాధేయపడి నీ వివిధ రూపాల (విభూతుల) ప్రభావాన్ని సవిస్తరంగా, విపులంగా విశదీకరించమని ప్రాధేయపడితే, కృష్ణుడిలా వివరించాడు ''కురుశ్రేష్ఠుడివైన ఓ అర్జునా, అనంతమైన నా రూపాలలో కొన్నింటిని మాత్రమే వివరిస్తాను.

**హన్తతే కథయిష్యామి, దివ్యా హ్యాత్మ విభూతయః**
**ప్రాధాన్యతః కురుశ్రేష్ఠ నాస్త్యంతో విస్తరస్య మే (10-19)**

ఇక్కడ మనం అందరం చెప్పుకునే ''స్థాలీపులక న్యాయం'' తొంగిచూస్తున్నది. అంటే అన్నం ఉడికిందో లేదో చూడడానికి ప్రతి మెతుకునూ పట్టుకొని పరిశీలించాల్సిన పనిలేదు. ఏ ఒక్క మెతుకును చూచినా సరిపోతుంది. అనంత మైన, విశ్వవ్యాప్తమైన పరమాత్మను గుర్తించడానికి అణువణువూ చూడాల్సిన పనిలేదు. ఆయన ఎక్కడక్కడ ఉన్నాడో ఆయనే అర్జునుడికి ఇలా వివరించాడు.

''సమస్త భూతముల యందుండెడి ఆత్మను నేనే, సమస్త ప్రాణులలోని ఆది మధ్యాంతాతా నేను''.

**అహమాత్మాగుడాకేశ - సర్వభూతాశయస్థితః**
**అహమాదశ్చ మధ్యంచ - భూతానా మంతయేవచః (10-10)**

నిజంగా అంతేకదా! ప్రతి జీవీ భగవంతుడే అర్థం చేసుకో గలిగితే! ప్రతి వ్యక్తీ భగవానుడే! అలా అని తప్పుడు పని చేసేవాడు భగవంతుడు కాదు. ఆ వ్యక్తి తనలోని ఆ తప్పుడు గుణాన్ని పరిహరించుకో గలిగితే అతడు కూడా దేవుడే! అందుకే ఈ కోర్టులూ, శిక్షలూనూ.... అతనిలోని చెడును తొలిగించి మంచిని పెంచడానికే క్రమశిక్షణ కలిగించడానికే కారాగార వాసము పనికి వస్తుంది. కాబట్టి శిక్షించడం శిక్షించడం కోసంకాక అతణ్ణి బాగుపరచడం కోసమేనని అందరూ గ్రహించాలి!

అందుకే కృష్ణుడు శ్రేష్ఠమైనవి, శ్రేష్ఠతరమైనవీ నేనే అని నొక్కివక్కాణించాడు.

ఆదిత్యులలో విష్ణుమూర్తిని నేనే! మీ అందరికీ తెలిసినదే కశ్యప ప్రజాపతి భార్యవైన 'దితి' కొడుకులందరూ ''దైత్యులు' అయితే, ''అదితి'' కొడుకులందరూ ''ఆదిత్యాలు'' (ద్వాదశాదిత్యులు) అయినారు. అలాంటి ఆదిత్యాలలో శ్రేష్ఠాతి శ్రేష్ఠుడైన విష్ణుమూర్తిని నేనే అని కృష్ణుడు చెబుతున్నాడు. వెలుగులను అందించే ప్రకాశమాన మూర్తులలో సూర్యుణ్ణి నేను మరుద్గణాలలో మరచిని నేను నక్షత్రాలలో చంద్రుణ్ణి నేను సూర్యుడు స్వయంగా ప్రకాశిస్తుంటే, చంద్రుడు మాత్రం సూర్యుని వేడిమిని

తాను గ్రహించి తాను భూమికి వెన్నెలల యిస్తున్నాడు.

**ఆదిత్యానామ అహం విష్ణుః, జ్యోతిషాం రవిరంశుమాన్**
**మరీచిర్మరుతామస్మి, నక్షత్రాణామహం శశీః॥ (10-21)**

వేదాలలో సామావేదాన్ని నేనే. దేవతలలో దేవేంద్రుణ్ణి నేను ఇంద్రియాలలో మనస్సును, ప్రతి ప్రాణిలో ఉన్న చైతన్యాన్ని నేనే.

**వేదానాం సామవేదోఽస్మీ, దేవానామస్మి వాసవః**
**ఇంద్రియాణాం మనశ్చాస్మి, భూతానామసి చేతన॥ (10-22)**

ఏకాదశరుద్రులలో శంకరుణ్ణి, యక్షులలో కుచేరుణ్ణి, అష్టవసువుల్లో అగ్నిని, పర్వతాల్లో మేరు పర్వతాన్ని నేను.

**రుద్రాణాం శంకరాశ్చాస్మి విత్తేశో యక్ష రాక్షసమ్**
**వసూనాం పావకశ్చాస్మి మేరుః శిఖారిణామహమ్ (10-23)**

పురోహితులలో బృహస్పతిని, సేనాపతులలో కుమారస్వామిని, జలాశయాలలో సముద్రుణ్ణి నేనే!

**పురోధసాం చ ముఖ్యం మాం విద్ధి పార్థ బృహస్పతిమ్**
**సేనానీనామహం స్కందః సరసామస్మి సాగరః (10-24)**

మహర్షులలో బృగుమహర్షిని, శబ్దాలలో ఓంకారాన్నీ, యజ్ఞాలలో జపయజ్ఞాన్నీ, స్థావరాల (కదలనిది - కొండ)లో హిమాలయాన్నీ నేనే.

**మహర్షీణాం భృగురహం, గిరామస్మ్యేక మక్షరమ్**
**యజ్ఞానాం జపయజ్ఞోఽస్మి, స్థావరాణాం హిమాలయః (10-25)**

వృక్షాలలో అశ్వత్థ వృక్షాన్నీ, దేవర్షులలో నారదుణ్ణి, గంధర్వులలో చిత్రరధుణ్ణి, సిద్ధులలో కపిలుణ్ణీ నేనే!

**అశ్వత్థః సర్వవృక్షాణాం దేవర్షీణాం చ నారదః**
**గంధర్వాణాం చిత్రరథః సిద్ధానాం కపిలో మునిః (10-26)**

గుర్రాలలో - క్షీర సాగరమధనంలో అమృతంతో బాటు జన్మించిన ఉచ్చైశ్రవాన్నీ, ఏనుగుల్లో ఐరావతాన్నీ, మానవులలో 'రాజు'ను నేనే!

**ఉచ్చై శ్రవసమశ్వానాం, విద్ధిమామమృతోద్భవమ్**
**ఐరావతం గజేంద్రాణాం, నరాణాం చ నరాధిపమ్ (10-27)**

ఆయుధాలలో వజ్రాయుధాన్నీ, ధేనువులలో కామధేనువును, సంతానోత్పత్తిలో కామాన్నీ, పాములలో వాసుకినీ నేనే.

**ఆయుధానామహం వజ్రం ధేనూనామస్మి కామధుక్!**
**ప్రజానశ్చాస్మి కందర్పః సర్పాణామస్మి వాసుకిః (10-28)**

అలాగే నాగులలో ఆధిశేషుణ్ణీ, జలదేవతల్లో వరుణిణ్ణి, పితృదేవతులలో ఆర్యముణ్ణీ, శాసకాలలో యముణ్ణీ నేనే!!

**అనంతశ్చాస్మి నాగానాం - వరుణో యాదసామహమ్**
**పిత్యాణామర్యమాచాస్మి- యమ సంయమతామహమ్ (10-29)**

దైత్యుల్లో ప్రహ్లాదుణ్ణి, జ్యోతిష్కులలో కాలపురుషుణ్ణీ, మృగములలో సింహాన్నీ, పక్షులల్లో గరుత్మంతుణ్ణీ నేనే!!

**ప్రహ్లాదశ్చాస్మి దైత్యానాం కాలః కలయతామహమ్**
**మృగాణాం చ మృగేంద్రోఽహం వైనతేయశ్చ పక్షిణామ్ (10-30)**

వడిగా పరిగెత్తు వారిలో వాయువును, ధనుర్ధారులలో రాముణీ, జలచరాల్లో మొసలిని, ప్రవాహములలో గంగనూ నేనే!

**పవనః పవతామస్మి, రామః శ్శస్త్రభృతామహమ్**
**ఝషాణాం మకరశ్చాస్మి, స్రోతసామస్మి జాహ్నవీ (10-31)**

సృష్టిలోని ఆదిని, మధ్యను, అంతమునూ నేనే. విద్యలలో బ్రహ్మవిద్యనూ (ఆధ్యాత్మవిద్యనూ) తత్త్వములలో వాదాన్నీ నేను .

**సర్గాణామదిరంతశ్చ మధ్యం చైవాహమర్జున**
**అధ్యాత్మవిద్యా విద్యానాం వాదః ప్రవదతామహమ్ (10-32)**

అక్షరాలలో 'అ' కారాన్ని నేనే సమాసాలలో ద్వంద్వ సామాసాన్నీ నేనే. కాలాన్నీ సర్వ భూతాలనూ పోషించే విరాట్పురుషుణ్ణీ నేనే!

సంహరించే మృత్యువునూ నేనే, పుట్టించే ఉత్పత్తి స్థానాన్నీ నేనే. స్త్రీల యందు కీర్తిని మాటకారితనాన్నీ, ఓర్పును ధైర్యన్నీ అన్నీ నేనే!! (సశేషం)

6. వికట

# అష్ట వినాయకులు

.... కీ.శే. డా॥ రోహిణి వెంకట సుందరవరదరాజేశ్వరి

**వికటో నామ విఖ్యాతః కామాసుర విదాహకః।**
**మయూరవాహనశ్చాయం సౌరబ్రహ్మధరః స్మృతః॥**

గణేశభగవానుని వికట నామము ప్రసిద్ధమైనది. ఈ అవతారము కామాసుర సంహారకమైనది. వీనిది మయూర వాహనము. సౌరబ్రహ్మధారక స్వరూపమైనది.

విష్ణుభగవానుడు జలాంధరుని వధింపగోరి "వృంద" తపము భంగ మొనరించుటకు వెళ్ళెను. ఆ సమయమున వీని శుక్రము నుండి అతి తేజస్వియైన కామాసురుడు జన్మించెను. కామాసురుడు దైత్యగురువు శుక్రాచార్యుని వద్ద దీక్షగొని తపమునకై వనమునకు వెళ్ళెను. అచట పంచాక్షరీ మంత్రము జపించుచూ, కఠోరమైన తపస్సు ప్రారంభించెను. అన్న పానీయములను త్యజించెను. ఇతని శరీరము దినదినము క్షీణించుచుండెను. తేజస్సు పెరుగుచుండెను. వెయ్యి సంవత్సరములు పూర్తియైన తరువాత శివుడు ప్రసన్నుడై "వరమడుగు"మనెను.

శివ భగవానుని దర్శనముతో కృతార్థుడైన కామాసురుడు శంకరుని చరణములకు ప్రణామములు గావించి "ప్రభూ! నాకు బ్రహ్మాండ రాజ్యమును, మీపై భక్తిని ప్రసాధించుడు. నేను బలవంతుడను. మృత్యుంజయుడను గావలె"నని కోరుకొనెను.

శివభగవానుడు వానితో "నీవు అతి దుర్లభమైనది. దేవతలకు దుఃఖమును కలిగించునట్టిదియైన వరమును కోరితివి. ఐననూ నేను నీ కోరిక తీర్చుచుంటిని" అని అనెను.

కామాసురుడు ప్రసన్నతచెంది శుక్రాచార్యుని చెంతకేగి సమస్త విషయమును చెప్పెను. శుక్రాచార్యుడు సంతసించి మహిషాసుర పుత్రికయైన "తృష్ణ"తో వీనికి వివాహము జరిపించెను. అదే సమయమున సమస్త దైత్యుల సమక్షమున శుక్రాచార్యుడు కామాసురుని దైత్యులకు అధిపతిగా నియమించెను. సమస్త దైత్యులు దీనిని అంగీకరించిరి.

కామాసురుడు అతి సుందరమైన "రతిద" నామ నగరమును తన రాజధానిగా చేసి కొనెను. రావణ, శంబర, మహిష, బలి, దుర్మదులను తన సేనకు ప్రధానులుగా నియమించెను. భూమండలమందున్న సమస్త రాజులను జయించెను. స్వర్గముపై దండెత్తి ఇంద్రాది దేవతల నోడించి దానిని స్వాధీనపరచుకొనెను. వరప్రభావముతో కొద్ది సమయములోనే త్రిలోకములపై అధికారము పొందెను. ఇతని రాజ్యమందు ధర్మము నశించెను. మోసము, కపటముతో రాజ్యము నిండియుండెను. దేవతలు, మునులు, ధర్మపరాయణులైనవారు అతి కష్టముల పాలగుచుండిరి.

ముద్గల మహర్షి ప్రేరణతో సమస్త దేవతలు మయూరేశక్షేత్రమునకు వెళ్ళి అచట గణేశుని భక్తితో పూజింపసాగిరి. దేవతల ఉపాసనతో ప్రసన్నుడైన మయూర వాహన గణేశ భగవానుడు ప్రత్యక్షమై దేవతలను "వరము కోరు" కొమ్మనెను.

దేవతలు ''ప్రభూ! మేము కామాసురుని అత్యాచారముల వలన పీడింపబడుచుంటిమి. మమ్ము రక్షింపుడు.'' అని వేడుకొనగా "తథాస్తు" అని వికట భగవానుడు అంతర్ధానమయ్యెను.

మయూర వాహనముపై వికట భగవానుడు దేవతలతో కలసి కామాసురుని నగరమును ముట్టడించెను. కామాసురుండునూ దైత్యులతో కలసి వెలుపలకు వచ్చెను. భయంకరమైన యుద్ధము జరుగుచుండెను. ఆ యుద్ధమందు కామాసురుని ఇరువురు పుత్రులు "రోషణ", "దుష్పూరు" లు మరణించిరి.

వికట భగవానుడు కామాసురునితో ''నీవు శివభగవానుని వర ప్రభావముతో ఎన్నో అధర్మములు గావించితివి. నీవు జీవించి యుండవలెనని కోరుకొనిన దైవద్రోహము విడనాడి నన్ను శరణు వేడుము. లేకున్న నీ మరణము నిశ్చయము'' అని అనెను.

కామాసురుడు క్రోధముతో తన గదను వికట భగవానునిపై వేసెను. అది భగవానుని స్పర్శించకనే నేలకూలెను. కామాసురుడు మూర్ఛపోయెను. శక్తి హీనుడయ్యెను.

ఈ అద్భుతమును గాంచిన కామాసురుడు "భగవానుడు శస్త్రము ప్రయోగించకనే ఇట్టి దుర్దశ సంభవించెను. మరి శస్త్రము ప్రయోగించిన ఏమిగతి ?" అని భయపడి వికట భగవానుని శరణు వేడెను. మయూరేశుడు వానిని క్షమించెను.

దేవతలు, మునులు భయముక్తులైరి. వికట భగవానునికి 'జయము, జయము' అని కీర్తించిరి.

---

**27వ పేజి తరువాయి ......**

బోధించుచున్నది.

**మం॥ ఇన్ద్రియాణి మనోబుద్ధిః కామక్రోధాదికం జితమ్।**
**తేనైవ విజితం సర్వం నా సౌ కేనాపి బాధ్యతే॥**
**(యోగశిఖోపనిషత్)**

'ఇంద్రియములు, మనస్సు, బుద్ధి, కామక్రోధాదికములను జయించినవానిచే సర్వము జయింపబడినదగుచున్నది. అతడు దేనిచేతను ఇంక బాధింపబడడు'.

ఇంద్రియ నిగ్రహము లేక భోగములయందు తగుల్కొనిన మానవుని ప్రజలెట్లు అసహ్యించుకొందురో శ్రీమద్వాల్మీకి రామాయణము చక్కగా వర్ణించుచున్నది:

**శ్లో॥ సక్తం గ్రామ్యేషు భోగేషు కామవృత్తం మహీపతిమ్॥**
**లుబ్ధం స బహు మన్యనేత్త శ్మశానాగ్ని మివ ప్రజః ॥**
**(వాల్మీకి రామాయణం)**

'రావణా! ప్రాపంచిక గ్రామ్యభోగములయందు తగుల్కొని కామమే తన వృత్తిగా భావించి, లోభగుణములతో మునిగి తేలుతూ ఉన్న రాజును శ్మశానాగ్నిని చూచి బయపడినట్లు చూస్తూ ప్రజలు మన్నింపజాలరు'.

ఈ మాటలు శూర్పణఖ రావణునితో చెప్పినది. ఇందులో విశేషమేమనగా - శూర్పణఖ లాంటి మహారాక్షసి ఈమాటలు చెప్పినదంటే, ఇంద్రియ నిగ్రహము యొక్క ఆవశ్యకతను మనము అర్థముజేసికొనవలెను.

కావున, ప్రతి మానవుడు ఇంద్రియ నిగ్రహమును గలిగియుండి పరమ పదమును పొందును గాక! యని సనాతన ధర్మము ఆశించుచున్నది.

### ఆంధ్రప్రదేశ్ - తెలంగాణలలో

# దర్శనీయ దేవాలయాలు - చారిత్రక ప్రదేశాలు

## కాకినాడ (ఆంధ్రప్రదేశ్ - తూర్పుగోదావరి)

శ్రీ రోహిణి మహేష్, M.A., L.L.B., కన్నావారి తోట 2వ లైను, 27-9-54, గుంటూరు - 522 004

కాకినాడ ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా కేంద్రం. ఇక్కడ శ్రీ బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం, బీచ్, మ్యూజియం ఉన్నాయి.

**శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం :**

పిఠాపురం మహారాజు వారు ఇచ్చిన ఖాళీ స్థలంలో క్రీ.శ. 1884లో శ్రీ హేజీబు భీమయ్య (భీమ శంకరుడు) నిర్మించినారు. వీరు అమ్మవారి ఉపాసకులు. అమ్మవారు వీరికి కలలో కనిపించి ఆలయం నిర్మించమని ఆదేశం ఇచ్చారు. అమ్మవారు వీరింటికి వచ్చి గాజులు వేయించుకున్నట్లు చెబుతారు. అమలాపురం మండలంలో పేరూరు గ్రామానికి చెందిన పేరి నరసింహశాస్త్రి గారు ఆలయ శ్రీకృష్ణ చక్రం గీసినారు. భీమయ్య గారు ఆలయం ముందు కోనేరు నిర్మించారు.

ఇక్కడ ఆలయంలో భద్రకాళి, వీరభద్రస్వామి, వల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి, శ్రీ విఘ్నేశ్వరుడు, చండీశ్వరుడు, దత్తాత్రేయు, పాండురంగస్వామి విగ్రహాలున్నాయి. శ్రీసూర్య నారాయణస్వామి, అయ్యప్పస్వామి ఆలయాలు కూడా ఈ ఆలయానికి దగ్గరలో కలవు.

చైత్ర శుద్ధ ఏకాదశి నుండి కల్యాణ మహోత్సవాలు జరుగుతాయి. అమ్మవారికి శ్రావణ శుక్రవారాల్లో అసంఖ్యాకంగా భక్తులు దర్శించి, పూజలు నిర్వహిస్తారు. ఆశ్వయుజ శుద్ధ పాఢ్యమి మొదలు విజయదశమి వరకు శరన్నవరాత్రి మహోత్సవాలలో రోజుకో అవతారంతో అమ్మవారిని అలంకరిస్తారు.

మొదటి రోజున విల్లంబులతో అలంకరిస్తారు.

రెండవ రోజున ఊయలలో అలంకరిస్తారు.

మూడవ రోజున పుస్తకాలతో అలంకరిస్తారు

నాల్గవ రోజున వీణాపాణితో అలంకరిస్తారు.

ఐదవ రోజున జపమాలతో అలంకరిస్తారు.

ఆరో రోజున సింహవాహనంతో అలంకరిస్తారు.

ఏడవ రోజున రక్తబీజాక్షుని వధతో అలంకరిస్తారు.

ఎనిమిదవ రోజున శుంభని శుంభుల వధతో అలంకరిస్తారు.

తొమ్మిదవ రోజు మహిషాసుర మర్ధనితో అలంకరిస్తారు.

చివరి రోజున శమీపూజ చేస్తారు.

శ్రీరామలింగేశ్వరస్వామి వారికి పలురకాలు నృత్యాలతో, బాణసంచాతో గొప్ప వేడుక జరుగుతుంది. ఎదురుగా ఉన్న పుష్కరిణిలో తెప్ప ఉత్సవం కూడా ఇక్కడ ప్రత్యేక ఆకర్షణ.

**శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయం**

క్రీ.శ 1966లో భక్తులచే స్వామివారి ఆలయం జగన్నాధపురం ఉప్పటేరు వంతెన ప్రక్కన నిర్మించబడింది. ప్రతి సంవత్సరము ధనుర్మాసము నెల రోజులు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారికి చామంతి పుష్పములు, పూజలు ప్రత్యేక

గ్రామోత్సవ పూజలు వైభవంగా జరుగుతాయి. భోగి పండుగ రోజున గోదాదేవి కల్యాణ మహోత్సవములు జరుగుతాయి.

**బీచ్**

దేశవిదేశీ నౌకలు ఒడ్డుకు ఏడు, ఎనిమిది కి.మీ. దూరంలో ఆపి చిన్న చోట్ల ద్వారా సరుకులను సరఫరా చేస్తుంటారు. సముద్రం ఒడ్డు నుంచి చీకట్లో ఓడలను చూస్తుంటే నౌకలలోని వెలుగు నక్షత్ర మండలంలా కనిపిస్తుంది. నౌకలకు దారి చూపడానికి ఇక్కడ నెల కొల్పిన లైట్ హౌస్, లక్ష ఒక్క లింగాల శివాలయం, ఆది కుంభేశ్వరుని ఆలయం చూడదగినవి.

సముద్రం ఒడ్డునుంచి 15 కి.మీ. దూరంలో ఉన్న హోప్ ఐలాండ్ ప్రాంతం సందర్శకులకు కనువిందు చేస్తుంది. చిన్న దీవిగా ఉన్న ఈ ప్రాంతానికి చేరడానికి మత్స్యశాఖ అధికారుల అనుమతి తీసుకోవలసి ఉంది. చిన్నలాంచిలో మూడు గంటలపాటు సముద్ర ప్రయాణం చేస్తే హోప్ ఐలాండ్ ప్రాంతానికి చేరుకుంటాం.

రాత్రిపూట నౌకలకు మార్గం చూపడానికి వీలుగా క్రీ.శ. 1878లో స్థానిక సూర్యారావుపేటలో ఏర్పాటు చేసిన లైట్ హౌస్ నేటి సాంకేతిక అభివృద్ధికి సవాల్‌గా నిలుస్తుందనడంలో సందేహంలేదు. కిరోసిన్ ద్వారా వెలిగే లైటులో సుదూరంగా ఉన్న ఓడలకు, నావికులకు దారి చూపిస్తుంది. ఎలాంటి విద్యుత్ అవసరం లేకుండా కేవలం కిరోసిన్ దీపం ద్వారా ఇంత వెలుగు ఎలావస్తుందనేది ఇప్పటికీ జవాబు లభించని ప్రశ్నే! సుమారు 20 నాటికన్ మైళ్ళ దూరంలోని ఓడలకు ఈ వెలుగు నిరంతరాయంగా దిశనిర్దేశం చేయడం గొప్పవిషయం. విహారయాత్రికులు సమీప ప్రాంతవాసులు లైట్ హౌస్ ప్రక్కనున్న నీటివనరులతో దాహార్తి తీర్చుకుంటారు. సంవత్సరం పొడవునా ఈ ప్రాంతంలో నీరుండడం విశేషం. ఈ లైట్ హౌస్ 92 అడుగుల ఎత్తున భవిష్యత్తు అవసరాల దృష్ట్యా పకడ్బందీగా నిర్మించారు.

కార్తీక మాసంలో ఆది కుంభూశ్వర ఆలయంలో కుంభాభిషేకం నిర్వహిస్తుండటం ఆనవాయితీగా వస్తుంది. ఆలయముఖద్వారంలో రాక్షసరాజు, రావణబ్రహ్మ విగ్రహం, లోపల భారీ నందీశ్వర విగ్రహాలు మరియు వివిధ దేవతా విగ్రహాలు కలవు. వీటిని చూస్తున్నంతసేపు చూపరులకు మరో యుగంలో గడిపే అనుభూతి కలుగుతుంది. వలయాకారంగా ఉండే ఈ ఆలయం లోపలికి వెళితే సముద్ర మధ్యలో నిలుచున్నట్లుంటుంది.

బీచ్‌కు సమీపంలో క్రీ.శ. 1922లో నిర్మలానంద భారతిచే నిర్మించబడిన ఈ ఆలయం కాలక్రమంలో వెయ్యి లింగాల శివాలయంగా ప్రసిద్ధికెక్కింది. కాత్యాయని సమేత కైలాస సహస్ర మహారామలింగేశ్వరస్వామితో పాటు ఈ ఆలయంలో 1001 లింగాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. రెండంతస్తులుగా నిర్మించిన ఆలయం క్రింది భాగంలో 1001 లింగాలకు పై భాగంలో కాత్యాయని మహాలింగేశ్వరుని ప్రతిష్టించారు. లింగంపై వేసే సమస్త అభిషేక పదార్థాలు క్రింది భాగంలోని 1001 లింగాలపైన పడటం దీని ప్రత్యేకత. ప్రతి శివాలయంపైభాగాల్లో గోపురాలతో నిర్మితమై ఉండగా ఆలయం గోపుర స్థానం లింగాకృతితో నిర్మితం కావడం మరోవిశేషం. ప్రత్యేక పూజలు దోష నివారణ కోసం ఈ గుడికి వివిధ ప్రాంతాల నుంచి అనేక మంది వస్తుంటారు.

**మ్యూజియం**

ఇక్కడ రాష్ట్ర పురావస్తుశాఖ నిర్వహిస్తున్న ఆంధ్రసాహిత్య ప్రదర్శనశాలలో క్రీ.శ. 14, 15 వ శతాబ్దాలకు చెందిన విగ్రహాలు సందర్శకులను ఆకర్షిస్తాయి.

# వివిధ వ్యాధులు - ఆయుర్వేద చికిత్సలు

డా॥ టి. చంద్రశేఖరం, తిరుపతి. 9701181966

**1. విశ్వామిత్ర చూర్ణం :**

అశ్వగంధ గడ్డలు 200 గ్రాములు, అతిమధురం వేర్ల పొడి 100 గ్రాములు, శొంఠిపొడి 50 గ్రాములు, పటిక బెల్లం 350 గ్రాములు. అశ్వగంధ గడ్డలను శుభ్రపరచి ఆవుపాలతో నానబెట్టి మరగించి పాలు పూర్తిగా ఇంకిన తర్వాత అశ్వగంధ గడ్డలను ఎండబెట్టాలి. ఇలా 3 సార్లు / 7 సార్లు పాలతో పూర్తిగా మరగించి ఎండబెట్టిన అశ్వగంధ గడ్డలను బాగా దంచి పొడిచేసుకోవలెను. అదే విధంగా అతి మధురం వేర్లను పాలలో నానబెట్టి మరగించి ఎండబెట్టాలి. ఇలా 3 సార్లు / 7 సార్లు చేసిన తర్వాత బాగా పొడి చేసుకోవలెను. శొంఠిని దోరగా నేతితో వేయించి పొడి చేసుకోవలెను. పై మోతాదులో ఈ మూడింటి మిశ్రమాన్ని కలుపుకొని మెత్తగా పొడిచేసుకొని నిల్వ ఉంచుకోవాలి.

ఇది పిల్లలకు 1/4 చెంచా నుండి 1/2 చెంచా వరకు వేడిపాలలో కలిపి ఉదయం కానీ, రాత్రి గానీ నిదురించే ముందు త్రాపాలి. పెద్దలు 1/2 చెంచా నుండి 1 చెంచా వరకు వేడిపాలలో రాత్రి నిదురించే ముందు త్రాగాలి. దీనివలన శరీర బలహీనత / నరాల బలహీనత / కీళ్ళ నొప్పులు సర్వం పూర్తిగా నివారింపబడి సంపూర్ణ ఆరోగ్యము కలుగును.

**2. ద్రాక్ష రసాయనం :**

ఎండు ద్రాక్ష 100 గ్రాములు, అతి మధురం వేర్ల పొడి 100 గ్రాములు. అతిమధురం వేర్ల పొడి తీసుకొని దానిని ఎండు ద్రాక్షతో కలిపి బాగా నూరి పొడిని తయారు చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని గాజు పాత్రలో వుంచుకోవాలి. ఒక గ్లాసు వేడిపాలలో 1 చెంచా పొడిని కలిపి త్రాగాలి.

**3. నరాల బలహీనత కొరకు**

వాము 50 గ్రాములు, నాటు ఆవుపాలు 2 లీటర్లు. వామును శుభ్రపరచి దోరగా వేయించి పొట్టు తీసివేసి పాలలో వేసి బాగా మరగించి పాలు పూర్తిగా ఇంకి వాము మాత్రం మిగిలిన తర్వాత ఎండబెట్టి పొడి చేసుకోవాలి.

ఈ పొడిని వేడిపాలలో 1/2 చెంచా నుండి 1 చెంచా వరకు కలిపి రాత్రి నిద్రపోయే ముందు త్రాగవలెను. నరాల బలహీనత బాగా తగ్గిపోతుంది.

**4. శిరోసమస్యలకు / శిరస్సు సమస్యలకు :**

గసగసాలు 60 గ్రాములు, బాదంపప్పు 60 గ్రాములు, ఎండు ఖర్జూరం 60 గ్రాములు, ఇలాచి 5 గ్రాములు, ఏలకులు 5 గ్రాములు, పటిక బెల్లం 100 గ్రాములు. గసగసాలు దోరగా వేయించి పొడి చేసుకోవాలి. బాదంపప్పు ఒకరోజునీటిలో నానబెట్టి పై పొట్టు తీసి దానిని ఎండబెట్టి పొడిచేసుకోవాలి. ఎండు ఖర్జూరం ముక్కలు చేసి ఎండబెట్టి పొడి చేసుకోవాలి. ఏలకులు, ఇలాచి, పటిక బెల్లం విడివిడిగా పొడిచేసుకోవాలి. వీటిని ఒకటొకటి వరుసగా కలుపుకుని మిశ్రమాన్ని తయారుచేసుకోవాలి.

పెద్దలు 1/2 చెంచా, పిల్లలు 1/4 చెంచా వేడిపాలలో తీసుకొన్న ఆరోగ్యానికి చాలా మంచిది.

# వాస్తు- సైన్సు

.... ఆళ్ళ రామకృష్ణ,, రాజేంద్రనగర్, గుంటూరు. 9492464366

**భూ ఉపరితలంపై నీటి ట్యాంకు - అపోహలు - వివరణ**

ఈశాన్యంలో నీరు ఉండాలని వాస్తుశాస్త్రం చెబుతోంది. ఈ విషయాన్ని అవగాహన చేసుకోవడంలో కొంతమంది పొరపాటు చేస్తున్నారు. ఈశాన్య భాగంలో పెద్ద పెద్ద ట్యాంకులను, భూమి లోపల భాగంలో కాకుండా, భూ ఉపరితలంపై ఏర్పాటు చేసుకొంటున్నారు. తద్వారా ఈశాన్యం బరువు పెరుగుతుంది మరియు మెరక అవుతుంది. ఇది శాస్త్ర ప్రకారం తప్పు. ఈశాన్యంలో నీరు ఉండాలి అంటే, అక్కడ పల్లంగా ఉండటంగాని, నుయ్యి గాని ఉండాలని అర్థం. అంతేగాని, నీటిని నీటి తొట్టెలు మరియు ట్యాంకుల ద్వారా ఈశాన్యమూల ఏర్పాటు చేసుకోకూడదు. అలా చేసినట్లయితే, యింటి వాళ్ళు అనారోగ్యం పాలవ్వటం, చికాకులు, పోట్లాటలతో ఇబ్బంది పడటం జరుగుతుంది.

ఈశాన్యంలో మురికి గొయ్యి, డ్రైనేజీ ఉండటం కూడ మంచిదని వాస్తుశాస్త్రం చెబుతుంది. అంటే దీని అర్థం, ఈశాన్యంలో పల్లం ఉన్నప్పుడే మనం వాడిన నీరు ఈశాన్యంలో పారడం జరుగుతుంది. కాబట్టి ఈశాన్యంలో దేవుడు , ఈశాన్యంలో నీరు, ఈశాన్యంలో మురుగు, ఈశాన్యంలో నుయ్యి అని చెప్పటం పరిపాటి ఏతావాతా, ఈశాన్యంలో బరువు తగ్గించి, మిమ్మల్ని సౌఖ్యవంతులను చేయడమే అసలు ఉద్దేశ్యం. కాబట్టి ఇక్కడ కలిసి వచ్చే అంశం ఈశాన్యంలో పల్లం మాత్రమే ఇంకేమీకాదు. ఇది ముమ్మాటికి నిజం.

భూమిపై నీటి ట్యాంకు ఏర్పాటు చేసుకొనదలిచనవారు, నైఋతి దిక్కులో అయితే ఉపగృహంపైన ఏర్పాటు చేసుకోవాలి. అలాగే పడమర మరియు దక్షిణ దిక్కులలో భూమిపైన సిమెంటుతో చేయించి ఏర్పాటు చేసికొనవచ్చును. నీటి ట్యాంకు భూమిపై వాయవ్యంలో ఉత్తరపు ప్రహరీ గోడకు మరియు ఉత్తరాన యింటి గోడకు తగలకుండా, అదే విధంగా, ఆగ్నేయంలో తూర్పు ఇంటిగోడకు మరియు తూర్పు ప్రహరీ గోడకు తగలకుండా వేసుకొనవచ్చును. ఆగ్నేయంలో భూమిపై నీటి ట్యాంకు దక్షిణపు గోడను తగలవచ్చు. వాయువ్యంలో నీటి ట్యాంకు పడమరగోడకు ఆనవచ్చు. ఈ ట్యాంకును ఏ ఆకారములైనా వేసుకొనవచ్చును. ఈ వివరణ భూ ఉపరితంపై వేసుకొనే ట్యాంకులకు మాత్రమే. గమనించగలరు.

భూగర్భంలో ట్యాంకు నిర్మించుకోవాలంటే, తూర్పును 11 సమభాగాలుగా విభజించి, ఆగ్నేయ మూల నుండి 6వ భాగం అంతం అయిన తరువాత నుండి నీటి ట్యాంకు ఏర్పాటు చేసుకొనవచ్చు. అదే విధంగా, ఉత్తరంవైపు గూడా, ఉత్తరాన్ని 11 సమభాగాలుగా విభజించి, వాయవ్యము వైపు నుండి 6 భాగం అంతం అయిన తరువాత నీటి ట్యాంకు భూ గర్భంలో వేసుకోవాలి. భూగర్భం అంటే, నీటి ట్యాంకు యొక్క గోడ భూమి మట్టానికి పైకి పెరగకుండా జాగ్రత్తగా ఏర్పాటు చేసుకోవాలి. దక్షిణంలో గాని లేదా పడమరలోగాని, వాయవ్వంలోగానీ, ఆగ్నేయంలోగానీ నీటి ట్యాంకు లేదా గొయ్యిలాంటి నిర్మాణాలను ఎట్టి పరిస్థితులలోను చేపట్టవద్దు. భూగర్భ నీటి ట్యాంకు ఈశాన్యం పల్లం అయేలా నిర్మాణం చేసుకోవాలి. ఈశాన్యం పల్లం సకల సుఖ సంతోషాలకు నిలయం.